ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
3
సోమవారం 24 జూన్ 2024




తాడేపల్లి బోటుయార్డులో నిర్మాణాన్ని బుల్డోజర్లతో కూల్చుతున్న దృశ్యం

గలీజు నిర్మాణాలు

అధికారం మాది.. మరో ముప్పై ఏళ్లు మేమే పాలకులం.. మేం చెప్పిందే చట్టం.. అడిగేదెవరు.. అడ్డుకునేదెవరు.. అన్నట్లుగా వైసీపీ ఐదేళ్ల పాలన సాగిందనేందుకు ఎన్నో నిదర్శనాలు వెలుగుచూశాయి. వైసీపీ నియంతృత్వ పాలనకు జిల్లా కేంద్రాల్లో చేపట్టిన పార్టీ కార్యాలయాలే నిదర్శనంగా నిలుస్తాయి. రూ.కోట్ల విలువైన స్థలాలపై కన్నేసి.. కారుచౌక లీజులకు తీసుకుని.. అభ్యంతరాలు చెప్పిన వారిపై కేసులతో నోరు మూయించి.. సరైన అనుమతులు లేకుండా జగన్ రాజరికపు ధోరణిలకు అనుగుణంగా ప్యాలెస్‌లను మరిపించేలా వైసీపీ జిల్లా కార్యాలయాల నిర్మాణాలు జరిగాయి. జిల్లా కేంద్రాల్లో భారీగా చేపట్టిన నిర్మాణాలపై ఏ శాఖ అధికారి కూడా కన్నెత్తి చూసే సాహసం చేయలేదంటే వైసీపీకి ఏ రీతిగా అధికారులు ఊడిగం చేశారో వారి కార్యాలయాల నిర్మాణాలను చూస్తే అర్థమవుతుంది. నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణాలపై కనీసం నోటీసు ఇవ్వకుండా అధికారులు కళ్లు మూసుకున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. సామాన్యుడు గూడు కోసం ప్రభుత్వ స్థలం ఆక్రమించినా.. అనుమతి లేకుండా నిర్మాణం చేపడితే నానాహడావుడి చేసే అధికారులు వైసీపీ కార్యాలయాల విషయంలో కన్నెత్తి చూడలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కొలువు దీరడంతో ప్రభుత్వ భూముల్లో చేపట్టిన వైసీపీ కార్యాలయాలపై సమగ్ర విచారణ చేపట్టాలనే డిమాండ్లు ప్రజల నుంచి వ్యక్తమవుతుండడంతో స్థలాల కేటాయింపు అంశం తాజాగా తెరపైకి వచ్చింది.

రూ.కోట్ల స్థలాలు కారుచౌకగా కొట్టేశారు

- ప్రభుత్వ స్థలాల్లో వైసీపీ ప్యాలెస్‌ల నిర్మాణం
- అనుమతులు లేకుండా అడ్డగోలుగా పనులు
- బాపట్లలో మున్సిపాలిటీ అనుమతి లేకుండా ఏపీఐఐసీకి చెందిన స్థలంలో కార్యాలయ నిర్మాణం
- నరసరావుపేటలో కలెక్టరేట్‌కి సమీపంలో కార్యాలయం
- గుంటూరులో రూ.10 కోట్ల స్థలంపై కన్నేసి వెనక్కితగ్గారు

గుంటూరు, బాపట్ల, నరసరావుపేట (ఆంధ్రజ్యోతి)/ తాడేపల్లి టౌన్, జూన్ 23: రూ.కోట్లు విలువైన ప్రభుత్వ స్థలాలు వైసీపీ పరమయ్యాయి. అధికారాన్ని అడ్డంపెట్టుకుని చీకటి జీవోలతో విలువైన స్థలాలను కారుచౌక లీజులకు కొట్టేసి వైసీపీ జిల్లా కార్యాలయాలతో ప్యాలెస్ తరహా భవనాలను నిర్మించుకుని పాగా వేశారు. పారదర్శకంగా జరగాల్సిన భూ కేటాయింపు విషయాన్ని అత్యంత గుంభనంగా జరిపిన అధికారులు అధికార పార్టీకి వంతపాడారు. ఏదైనా భవనం కట్టాలంటే పలు అనుమతులు, నిబంధనలు అమలు చేయాలి. అయితే అవేవీ లేకుండానే కొన్ని దగ్గర్ల, తూతూమంత్రపు అనుమతులతో మరి కొన్ని దగ్గర్ల వైసీపీ నేతలు రూ.కోట్లు వెచ్చించి కార్యాలయాలను నిర్మించారు. ఇవేదో మారుమూల ప్రాంతాల్లో అయితే ఎవరికీ కానరాలేదు.. చర్యలు తీసుకోలేదు అనుకోవచ్చు. కానీ ఆయా జిల్లా కేంద్రాల్లోని ప్రధాన కూడళ్లలోనే వైసీపీ కార్యాలయాల నిర్మాణాలు జరిగాయి. అధికార దుర్వినియోగానికి వైసీపీ కార్యాలయాలకు స్థలాల కేటాయింపు, భవన నిర్మాణాలు బరితెగింపునకు నిదర్శనాలుగా ఉన్నాయన్న విమర్శలు పలువర్గాల నుంచి వస్తున్నాయి. అధికారం చేతిలో ఉండడంతో అన్ని వ్యవస్థలను చెరబట్టి తమకు అనుకూలంగా ఉత్తర్వులు తెచ్చుకుని కోట్ల విలువ గల స్థలాల్లో కార్యాలయాలను నిర్మించారు. ప్రధాన కూడళ్లలో స్థలాలను గుర్తించడం.. వాటి కోసం వైసీపీ నేతల నుంచి దరఖాస్తు వచ్చిందే తడువుగా ఆగమేఘాల మీద స్పందించిన ప్రభుత్వం సదరు స్థలాల్ని పార్టీకి కట్టబెడుతూ రహస్యంగా జీవోలుజారీ చేయగా అంతేవేగంగా రూ.కోట్లు వెచ్చించి ప్యాలెస్ తరహాలో కార్యాలయాలను నిర్మించుకున్నారు.

అడ్డగోలు నిర్మాణాలు

వైసీపీ జిల్లా కార్యాలయం కోసం బాపట్ల నడిబొడ్డున కేటాయించిన రెండెకరాల స్థలం విషయంలో జగన్ ప్రభుత్వం వేసిన పిల్లిమొగ్గలు అనీఇన్నీకావు. బాపట్ల జిల్లాకు ఒక్క పరిశ్రమ తేలేని వైసీపీ ప్రభుత్వం ఏపీఐఐసీ(ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్) పరిధిలోని రెండెకరాల భూమిని వైసీపీ జిల్లా కార్యాలయాన్ని 33 ఏళ్లకు ఏడాదికి రూ.వెయ్యి లీజుకు అప్పగించేసింది. ఈ స్థలం తమదని ఆర్టీసీ అభ్యంతరం వ్యక్తం చేసి ఫిర్యాదు చేయగా తర్వాత జరిగిన పరిణామాల్లో ఫిర్యాదు చేసిన ఆర్టీసీ అధికారిపై పాలకపార్టీ చర్య తీసుకుంది. కనీసం బిల్డింగ్ కట్టడానికి మున్సిపాల్టీ నుంచి కూడా అనుమతులు తీసుకోకుండా వైసీపీ జిల్లా కార్యాలయ నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఇక నరసరావుపేటలో ఖాళీ స్థలాల లీజుకు మంచి గిరాకీ ఉంది. ఇటీవల ఆర్టీసీ డిపోలో ఖాళీ స్థలం లీజుకు వేలం నిర్వహించగా 10/15 అడుగులకు నెలకు రూ.3 వేలు అద్దె చెల్లిస్తున్నారు. పల్నాడు రోడ్డులో ఐదు సెంట్ల ప్రైవేట్ ఖాళీ స్థలానికి రూ.39 వేలు అద్దె చెల్లిస్తున్నారు. అలాంటిది వైసీపీ కార్యాలయానికి ఇచ్చిన ఒకట్నిర ఎకరా స్థలానికి ఏడాదికి రూ.1500 అద్దెకు కేటాయించడం చూస్తే ప్రభుత్వ బరితెగింపు అర్థమవుతుంది. 33 ఏళ్లకు స్థలం లీజుకు కేటాయిస్తూ జీవో 360ను వైసీపీ ప్రభుత్వం జారీ చేసింది.


నరసరావుపేటలో ప్రభుత్వ స్థలంలో నిర్మించిన వైసీపీ కార్యాలయ భవనం

నరసరావుపేటలో రూ.25 కోట్ల స్థలంలో..

పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో దాదాపు రూ.25 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాన్ని వైసీపీ ప్రభుత్వం పార్టీకి అప్పనంగా అప్పచెప్పింది. కలెక్టరేట్, జిల్లా పోలీసు కార్యాలయానికి ఎదురు రోడ్డులో రాజీవ్ స్వగృహ అపార్ట్‌మెంట్ల పక్కన ఎకరం రూ.15 కోట్లకు పైగా ఉన్న ఒకటిన్నర ఎకరాలో వైసీపీ నాయకులు దర్జాగా కార్యాలయాన్ని నిర్మించారు. రాజీవ్ స్వగృహ అపార్ట్‌మెంట్లలో పల్నాడు జిల్లా ఆవిర్భావం తర్వాత అన్ని ప్రభుత్వ శాఖల జిల్లా కార్యాలయాలను ఏర్పాటు చేయాలని అధికారులు ప్రతిపాదించారు. అయితే ఈ ప్రాంతంలోని స్థలంపై కన్నేసిన వైసీపీ నాయకులు పార్టీ కార్యాలయం నిర్మాణానికి ఒకటిన్నర ఎకరా స్థలం లీజుకు ఇవ్వాలని దరఖాస్తు చేశారు. దరఖాస్తు వచ్చిందే తడువుగా ఆగమేఘాల మీద స్పందించిన ప్రభుత్వం సదరు స్థలాన్ని పార్టీకి కట్టబెడుతూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఆ జీవో ఆధారంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు, అప్పటి మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్లాన్ కోసం దరఖాస్తు చేయగా లింగంగుంట్ల పంచాయతీ అధికారులు అనుమతి ఇచ్చారు. 2022 మే 22న స్థలాన్ని తహసీల్దార్ అప్పగించగా అదే సంవత్సరం డిసెంబరులో స్థలం లీజు రూ.49,500 పిన్నెల్లి చెల్లించారు. ఆ వెంటనే దాదాపు రూ.2 కోట్లతో అన్ని హంగులతో పార్టీ కార్యాలయాన్ని నిర్మించారు. రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి భవన నిర్మాణానికి నిధులు సమకూర్చారు. పంచాయతీ మినహా మరే అనుమతులు భవన నిర్మాణానికి లేవు. వైసీపీ కార్యాలయం నిర్మించడంతో స్వగృహ అపార్ట్‌మెంట్లలో ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటు ఇబ్బందికరంగా మారే అవకాశాలు ఉన్నాయి.

వైసీపీ కబ్జా నుంచి విముక్తి

రహస్య జీవోతో, నామమాత్రపు లీజుతో, రూ.కోట్ల విలువ చేసే స్థలంపై కన్నేసి పార్టీ కార్యాలయం పేరుతో చేపట్టిన అక్రమ నిర్మాణాన్ని తొలగించడంతో వైసీపీ కబ్జా నుంచి తాడేపల్లిలోని బోట్ యార్డు స్థలానికి విముక్తి లభించింది. మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సీతానగరంలో నీటిపారుదల శాఖకు చెందిన బోట్ యార్డు స్థలం సర్వే నెంబరు 202/ఏ-1లో రెండు ఎకరాల భూమిని ఏడాదికి రూ.1000 వంతున 33 ఏళ్లకు, వైసీపీ పార్టీ కార్యాలయ ఏర్పాటుకు లీజ్‌కు గత ఏడాది ఫిబ్రవరి 23న జగన్ సర్కార్ జీ.వోను తీసుకువచ్చింది. ఈ ఏడాది ప్రారంభంలో అనుమతులు లేకుండా గుట్టుగా వైసీపీ కార్యాలయ భవన నిర్మాణ పనులు మొదలు పెట్టగా అప్పట్లో టీడీపీ, జనసేన నాయకులు ఆందోళనతో తాత్కాలికంగా పనులు ఆపారు. తిరిగి ఇటీవల ఎన్నికలకు ముందు పనులు ప్రారంభించి రెండు ఫ్లోర్లు నిర్మించేందుకు పిల్లర్లు సిద్ధం చేశారు. సీఆర్‌డీఏ ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారులు పలు మార్లు నోటీసులు జారీ చేసినా నిర్మాణ పనులు మాత్రం ఆగలేదు. ఎన్నికలు పూర్తి అయి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం వైసీపీ కార్యాలయ భవన అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులతో ఎట్టకేలకు అధికారులు శనివారం ఉదయం బుల్డోజర్‌లతో కూల్చేసి స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎట్టకేలకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రభుత్వ భూమికి విముక్తి కలిగిందని తాడేపల్లివాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గుంటూరులో రోడ్డులేదని వెనకడుగు

వైసీపీ జిల్లా కార్యాలయాన్ని గుంటూరులో సర్వహంగులతో నిర్మించేందుకు పెద్దఎత్తున ప్రయత్నాలు జరిగాయి. అయితే తాము కోరిన స్థలానికి సరైన అప్రోచ్ రోడ్డు లేదని వైసీపీ నాయకులు వెనకడుగు వేశారు. దీంతో అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాల ఎదురుగా ఉన్న సుమారు 2,500 చదరపు గజాల స్థలం తిరిగి నగరపాలక సంస్థకు దక్కింది. రూ.10 కోట్ల విలువ చేసే నగరపాలకసంస్థ ఆస్తిని 33 ఏళ్ల పాటు నామమాత్రపు లీజుతో కాజేసేందుకు ప్రయత్నాలు జరిగాయి. కార్పొరేషన్ కౌన్సిల్‌లో తీర్మానం చేశారు. ఇక్కడ చదరపు గజం విలువ రూ.40 వేలు ఉన్న విలువైన ఆస్తిని అధికార పార్టీ కొట్టేయాలని చూడటంపై అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ పెద్దఎత్తున ఆందోళనలు కూడా నిర్వహించింది. అయితే ఈ స్థలానికి అప్రోచ్ రోడ్డు కేవలం 15 అడుగులు మాత్రమే ఉండటంతో కొన్ని రోజుల తర్వాత వైసీపీ వెనకడుగు వేసింది. దాంతో ఆ స్థలం ప్రతిపాదన దశలోనే నిలిచిపోయింది. అదే కార్యరూపం దాల్చి ఉంటే ఈ పాటికే నగరపాలకసంస్థ ఆస్తి వైసీపీ స్వాధీనంలోకి వెళ్లిపోయి ప్యాలెస్ నిర్మాణం ప్రారంభమై ఉండేది.

బాపట్లలో అనుమతి లేకుండానే..

బాపట్ల నడిబొడ్డున ఆర్టీసీ గ్యారెజీ పక్కన ఉన్న రెండెకరాల స్థలాన్ని వైసీపీ కార్యాలయ నిర్మాణానికి 2022 డిసెంబరులో కేటాయించారు. దీనిపై కేటాయించడం అప్పట్లోనే పెద్దఎత్తున విమర్శలు వచ్చినా అటు అధికారులు, ఇటు వైసీపీ నాయకులు పట్టించుకోలేదు. ఆ స్థలం తమదని, అనుమతి లేకుండా నిర్మాణం చేపడుతున్నారంటూ ఆర్టీసీ ఉన్నతాధికారులు అప్పట్లో పోలీసులకు, రెవెన్యూ విభాగానికి ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత శంకుస్థాపన సమయంలో ఎంపీ మోపిదేవి, ఇన్‌చార్జి మంత్రి కొట్టు సత్యనారాయణ సమక్షంలోనే వారు అభ్యంతరం కూడా తెలిపారు. స్థలం తొలుత తమదేనని వాదించి ఫిర్యాదులు కూడా చేసిన ఆర్టీసీ అధికారులు ఆ తర్వాత పట్టించుకోలేదు. పైగా ఏపీఐఐసీకి ఆ స్థలం ఎప్పుడో అప్పగించినట్లు ఉన్నతాధికారులు ప్రకటించారు. అప్పటి ఆర్టీసీ ఎండీగా ఉన్న ద్వారకా తిరుమలరావు స్థలం విషయంలో విచారణ జరుపుతున్నామన్నారు. ఈ క్రమంలో ఆ స్థలం ఆర్టీసీది కాదని, ఏపీఐఐసీదని వారి చేతే చెప్పించారు. ఏపీఐఐసీకి చెందిన 10.62 ఎకరాలను 1990లో ఆర్టీసీ కొనుగోలు చేసిందని, ఇందులో దాదాపు 6 ఎకరాల్లో డిపో నిర్మించగా మిగతాది ఖాళీగా ఉంది. 2003లో ఆ మిగిలిన స్థలాన్ని ఏపీఐఐసీ తన పారిశ్రామిక అవసరాల కోసం వెనక్కి తీసుకుందని, అది తెలియక ఆర్టీసీ అధికారులు తమదనే వాదన చేశారని అప్పటి వైసీపీ ప్రభుత్వం వివరణ ఇచ్చింది. స్థలం విషయంలో జరిగిన తంతు ఇలా ఉంటే పట్టణం నడిబొడ్డున రాజప్రసాదం లాంటి భవంతి నిర్మాణం జరుగుతుంటే దానికి అనుమతి ఉందా లేదా అనే అంశంపై మున్సిపల్ అధికారులు దృష్టి సారించలేదు. అధికారుల అలక్ష్యంతో ప్లాన్ అప్రూవల్ లేకుండానే భవన నిర్మాణం జరిగిపోయింది. ఈ రోజుకు కూడా ఆ భవనానికి మున్సిపాలిటీ అనుమతి లేదనేది సమాచారం.

బాపట్ల : ఏపీఐఐసీ భూమిలో నిర్మించిన రాజప్రసాదం లాంటి వైసీపీ జిల్లా కార్యాలయం ఇదే



ప్రజల ఆకాంక్షలు నెరవేర్చాలి

- నిధులను పక్కదారి పట్టించిన వైసీపీ
- గుంటూరు నగర సమగ్ర అభివృద్ధికి ప్రణాళిక
- కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు(కార్పొరేషన్), జూన్ 23: ప్రజల ఆకాంక్షల మేరకు వారి అవసరాలు తీర్చాలని, అందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పని చేయాలని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. గుంటూరులో సమస్యలు, వాటి పరిష్కార మార్గాలు, మౌళిక వసతుల కల్పన, నగర అభివృద్ధిపై కేంద్ర సహాయ మంత్రి ఆదివారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో సమీక్షించారు. నగరపాలక సంస్థ ఆదాయ వ్యయాలు, అభివృద్ధి పనులపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా నగర పాలక కమిషనర్ కీర్తి వివరించారు. అనంతరం డాక్టర్ పెమ్మసాని మాట్లాడుతూ నగరంలో అధిక ప్రాధాన్యతగా తాగునీరు సరఫరా, మౌళిక వసతుల కల్పన, యూజీడీ పనులను చేపట్టాలన్నారు. నగరంలో అభివృద్ధి గతంలో పోలిస్తే 45 రోజుల్లో మెరుగ్గా ఉండేలా అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం జీఎంసీలో విభాగాల వారీగా సమీక్షిస్తానని తెలిపారు. అధికారులు ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అమృత్ పథకం 2.0 ద్వారా విలీన గ్రామాల్లో తాగునీరు అందించేందుకు 45 రోజుల్లో డీపీఆర్ సిద్ధం చేయాలన్నారు. పీవీకేనాయుడు మార్కెట్ నిర్మాణం, మానస సరోవరం, బీఆర్ స్టేడియం, నార్ల ఆడిటోరియంల అభివృద్ధి, ఇన్నర్ రింగ్‌రోడ్డు మూడో దశ, పచ్చదనం పెంపు తదితరాలపై ప్రతిపాదనలతో అధికారులు వచ్చే సమావేశానికి హాజరు కావాలన్నారు. అభివృద్ధి పనులకు నిధుల కోసం ఆదాయం పెంపు మార్గాలను చూడాలన్నారు. యూజీడీ పనులపై సమగ్ర నివేదిక ఇవ్వాలని పబ్లిక్ హెల్త్ ఎస్ఈని ఆదేశించారు. సమన్వయంతో నగర సమగ్రాభివృద్ధికి కృషి చేస్తామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ తెలిపారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రధాన డ్రెయిన్లలో పూడిక తీత పనులు వేగంగా చేపట్టాలని, పారిశుధ్య పనుల్లో కూడా మరింత మెరుగుదల ఉండాలని పశ్చిమ ఎమ్మెల్యే మాధవి తెలిపారు. 12 ఏళ్లకు ముందు విలీనమైన గ్రామాల్లో మౌళిక వసతులు కల్పించడానికి జీఎంసీ ప్రత్యేక శ్రద్ధ చూపాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు తెలిపారు. సమావేశంలో జీఎంసీ, పబ్లిక్ హెల్త్, టిడ్కో ఎస్ఈలు శ్యాంసుందర్, శ్రీనివాస్, కోటేశ్వరరావు, సీఎంవోహెచ్ డాక్టర్ ఆషా తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్‌లో ఎమ్మెల్యేలు, అధికారులులతో సమీక్షిస్తున్న డాక్టర్ పెమ్మసాని

అభివృద్ధి పనులన్నీ పూర్తి చేస్తాం

గుంటూరులో అర్ధాంతరంగా నిలిచిపోయిన పనులను త్వరలోనే పూర్తి చేస్తామని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. కలెక్టరేట్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ప్రధానమైన సమస్యలను గుర్తించామని, అందులో తాగునీరు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజి సమస్యలు ప్రధానమైనవన్నారు. వీటికి కేంద్ర ప్రభుత్వం ప్రపంచ బ్యాంక్ నిధులను అందజేసినా గత ప్రభుత్వం దారి మళ్లించిందని తెలిపారు. కాంట్రాక్టర్లకు ప్రభుత్వంపై నమ్మకం లేక చాలా టెండర్లు వివిధ దశల్లో ఆగినవాటిపై సమీక్షస్తామన్నారు. ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రంలో విశాఖపట్నం తర్వాత సెల్ఫ్ ఫైనాన్స్ కలిగిన అతి పెద్ద కార్పొరేషన్ గుంటూరు అని అయితే గత ప్రభుత్వం కార్పొరేషన్ చేయాల్సిన పనులను కూడా చేయలేని పరిస్థితి కల్పించారన్నారు. ఎమ్మెల్యే నసీర్, మాధవి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చేపట్టిన ప్రాజెక్టులు పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యాయన్నారు. వర్షాకాలంలో ముందస్తు జాగ్రత్త చర్యలపై చర్చించామన్నారు.

వేణుగోపాల్‌రెడ్డి రిలీవ్

- ఇన్‌చార్జి కలెక్టర్‌గా జేసీ రాజకుమారి
- నూతన కలెక్టర్ 26న బాధ్యతలు తీసుకునే అవకాశం

గుంటూరు, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ బాధ్యతల నుంచి వేణుగోపాల్‌రెడ్డి ఆదివారం రిలీవ్ అయ్యారు. ఇంచుమించు రెండు సంవత్సరాల రెండు నెలల పాటు కలెక్టర్‌గా విధులు నిర్వహించిన ఆయన ఆదివారం జిల్లా పాలనాధికారి బాధ్యతల నుంచి తప్పుకున్నారు. శనివారం రాత్రి జరిగిన ఐఏఎస్ అధికారుల బదిలీల్లో రాష్ట్ర ప్రభుత్వం వేణుగోపాల్‌రెడ్డిని సాధారణ పరిపాలన విభాగంలో రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశించింది. ఆ మేరకు జాయింట్ కలెక్టర్ రాజకుమారి గణియాకు ఇన్‌చార్జి బాధ్యతలను ఇచ్చి ఆయన రిలీవయ్యారు. ఈ నేపథ్యంలో సోమవారం జరగనున్న ప్రజా సమస్య పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని ఇన్‌చార్జి కలెక్టర్ హోదాలో జేసీ రాజకుమారి నిర్వహించనున్నారు. నూతన కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి బుధవారం జిల్లాకు వచ్చి బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉందని కలెక్టరేట్‌కు సమాచారం అందింది.


4లో..
దుర్గాదేవి అమ్మవారిని దర్శించుకున్న రాజధాని రైతులు

కూటమి గెలిచింది.. మొక్కు తీరింది


అధ్వాన స్థితిలో చిలకలూరిపేట మేజర్ కాలువ

సాగర్ కాలువలకు.. మోక్షం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- మరమ్మతులకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్
- రూ.22.54 కోట్లకు ప్రతిపాదనలు
- 473 పనులు గుర్తించిన జలవనరుల శాఖ

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నాగార్జున సాగర్ కుడి కాలువల పరిధిలోని కాలువల్లో నీరు పారే పరిస్థితి లేదు. అధ్వానంగా ఉన్న కాలువల బాగుకు ప్రభుత్వం స్పందించింది. పాడుబెట్టారు.. పట్టించుకోండి అనే శీర్షికతో కాలువల అధ్వాన స్థితిపై ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనంపై జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పందించారు. కాలువల మర్మమతులకు ప్రతి పాదనలు కోరారు. ఈ నేపథ్యంలో జలవనరుల శాఖ 473 పనులు చేపట్టేందుకు రూ.22.54 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు మంత్రికి అందజేసింది. నాలుగేళ్ల పాటు మరమ్మత్తులకు నిధుల విడుదల చేయకుండా వైసీపీ ప్రభుత్వం కాలువలను గాలికొదిలేసిన విషయం తెలిసిందే.

మేజర్లు, మైనర్‌లు, సబ్‌మైనర్ కాలువలు శిథిలస్థితికి చేరుకున్నాయి. సాగునీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తనున్నాయి. కాలువల్లో కంప చెట్లు పెద్ద ఎత్తున పెరిగాయి. జమ్ము, తూటుకాడ, రబ్బరు మొక్కలు కాలువల నిండా అల్లుకుపోయాయి. ఇవి నీటి సరఫరాకు అవరోధంగా మారనున్నాయి. తక్షణావసర మైన పనులు చేపట్టాలని ప్రభుత్వం జలవనరుల శాఖ అధికారులకు సూచించింది. ఈ మేరకు పనులను గుర్తించారు. పనులకు సంబంధించిన అంచనా లను రూపొందించారు. సాగర్ లింగంగుంట్ల సర్కిల్ పరిధిలో 473 పనులను గుర్తించారు. ఈ పనులు చేపట్టేందుకు రూ.22.54 కోట్లు వ్యయం అంచనా వేశారు. ఈ మేరకు సదరు అధికారులు జలవనరుల శాఖ మంత్రికి ప్రతిపాదనలు అందజేశారు. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాగానే పనులు చేపట్టేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు.

473 పనులు గుర్తించారు..

కుడికాలువ పరిధిలో ఈ ఏడాది కాలువలకు మర్మమత్తులు నిర్వహిం చేందుకు జల వనరుల శాఖ 473 పనులను గుర్తించింది. ఇందుకు సంబం ధించిన వ్యయం అంచ నాలను రూపొందించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. కాలువల్లో పూడికతీత, కంపచెట్లు, జమ్ము, తూటుకాడ తొలగింపు పనులు చేపట్టేందుకు అంచనాలు రూపొం దించారు. లింగంగుంట్ల ఓఅండ్‌ఎం డివిజన్ పరిధిలో 153 పనులు ఇందుకు వ్యయం అంచనా రూ.7.63 కోట్లు. మాచర్ల ఓఅండ్‌ఎం డివిజన్ పరిధిలో 133 పనులు వ్యయం అంచనా రూ.6.38 కోట్లు. ఓఅండ్‌ఎం డివిజన్ సత్తెనపల్లి పరిధిలో 107 పనులు వ్యయం అంచనా రూ.5.09 కోట్లు. లింగంగుంట్ల మనిటరింగ్ డివిజన్ పరిధిలో 24 పనులు వ్యయం అంచనా రూ.2.12 కోట్లు. ఓఅండ్‌ఎం సిప్ట్ డివిజన్ వినుకొండ పరిధిలో 56 పనులు వ్యయం అంచనా రూ.2.29 కోట్లు. మొత్తం 473 పనులకు రూ.22.54 కోట్లు వ్యయం అంచనాతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.


కాలువ కనిపించనంతగా గోవిందాపురం కాలువలో పెరిగిన చెట్లు

48 గంటల్లోనే..

- చీరాల యువతి హత్య కేసులో వేగంగా స్పందించిన ప్రభుత్వం
- సీఎం ఆదేశాలతో అధికార యంత్రాంగం పరుగులు
- సంఘటనా స్థలానికి వెళ్లిన హోంమంత్రి అనిత
- 48 గంటల్లోనే నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

బాపట్ల, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): మహిళలపై అకృత్యాలు చేసే వారి విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని కొత్త ప్రభుత్వం చెప్పినట్లుగానే చీరాలలో యువతి హత్య జరిగిన 48 గంటల్లోనే కేసును ఛేదించి నిందితులను అరెస్ట్ చేసింది. అలాగే బాధిత కుటుంబాన్ని హోంమంత్రి పరామర్శించి రూ.10 లక్షల చెక్కును అందించారు. ముఖ్యంగా సీఎం చంద్రబాబు ఆ ఘటనను సీరియస్‌గా తీసుకుని ఏకంగా డీజీపీతోనే కేసు విచారణ గురించి మాట్లాడడం మొదలుకుని హోంమంత్రి వంగలపూడి అనిత ఘటనా స్థలానికి అదే రోజు సాయంత్రం వెళ్లడం, హత్యకు గురైన యువతి కుటుంబానికి ఆర్థిక సాయం అందించడం ప్రభుత్వం తక్షణ స్పందనకు నిదర్శనంగా నిలిచింది. 48 గంటల్లోనే దారుణానికి పాల్పడిన నిందితులను అరెస్ట్ చేస్తామని పోలీస్ శాఖ చెప్పినట్లుగానే శనివారం రాత్రికే వారిని పట్టుకుని మీడియా ముందు ప్రవేశపెట్టడం లాంటివన్నీ మారిన పోలిసింగ్‌కు అద్దం పడుతున్నాయి. మహిళలపై దాడుల విషయంలో వేగంగా స్పందించడంతో పాటు నిందితులు ఎంతటి వారైనా కఠినంగా వ్యవహరించాలని పోలీసుశాఖకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. గంజాయి, మాదక ద్రవ్యాల మత్తులో జరుగుతున్న నేరాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. త్వరలోనే పోలీసుశాఖను ప్రక్షాళనచేస్తూ నిర్ణయాలు ఉండనున్నాయని సీఎం తెలిపారు.

పంచాయతీ నిధులను మళ్లించిన

అధికారులపై చర్యలు తీసుకోవాలి

- సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడఉ కల్లూరి శ్రీనివాసరావు



కల్లూరి శ్రీనివాసరావు

ప్రత్తిపాడు, జూన్ 23: గత ప్రభుత్వ హయాంలో పంచాయతీ గ్రామ పంచాయతీలకు రావాల్సిన నిధులను దొంగిలించి దారి మళ్లించిన అధికారులపై ఉన్నత స్థాయి విచారణ జరిపించి తగు చర్యలు తీసుకోవాలని ఉమ్మడి గుంటూరు జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కల్లూరి శ్రీనివాసరావు పంచాయతీరాజ్ శాఖా మంత్రి పవన్ కళ్యాణ్‌ను కోరారు. రాష్ట్రం లోని 12,918 పంచాయతీలకు గత నాలుగేళ్లలో కేంద్ర ప్రభుత్వం నుంచి నుంచి వచ్చిన 14, 15 ఆర్థిక సంఘం, ఉపాధిహామీ పథకం నిధులను ప్రభుత్వం దారి మళ్లించిందన్నారు. నిధుల దారి మళ్లింపుపై రాష్ట్ర స్థాయి అధికారులతో విచారణ జరిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వెంటనే గ్రామ పంచాయతీలకు రావాల్సిన నిధులను విడుదల చేయాలని కల్లూరి కోరారు.

విధులు సక్రమంగా నిర్వర్తించాలి



సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న మంత్రి మనోహర్

- విద్య, వైద్యం ప్రజలకు చేరువ కావాలి
- డయేరియా కేసులకు తావులేకుండా సురక్షిత నీరందించండి
- రైతులకు అందుబాటులో వ్యవసాయశాఖ ఉండాలి
- అధికారులతో రివ్యూ మీటింగ్‌లో మంత్రి నాదెండ్ల మనోహర్

తెనాలి రూరల్, జూన్ 23: 'గత వైసీపీ ప్రభుత్వంలా కాదు మా ప్రభుత్వం.. అధికారులు వారికి కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించకపోతే చూస్తే ఉరుకోం.. ప్రజల కోసం పనిచేసే సేవకులం మాత్రమే మేము.. మీరు కూడా అదే విధంగా ఆలోచించి మీకు కేటాయించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాల'ని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని కొత్తపేట ఎంపీడీవో కార్యాలయంలో మంత్రి మనోహర్ మండల స్థాయి అన్నిశాఖల అధికారులతో, సర్పంచ్‌లు, ఎంపీటీసీ, జడ్పీటీసీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని హాఫ్‌పేటలో వాటర్ ట్యాంక్ దుస్థితిపై అధికారులను ప్రశ్నించారు. దాని మరమ్మత్తులు చేపించడంతోపాటు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. కొలకలూరు గ్రామంలో మంచి నీరు రంగు మారి వస్తున్నాయని మనోహర్ దృష్టికి రావడంతో సంబంధిత అధికారులతో మనోహర్ మాట్లాడారు. కొలకలూరు గ్రామంలో ఇటీవల కాలంలో డయోరియా ప్రబలిన విషయాన్ని అధికార యంత్రాంగం గుర్తుపెట్టుకోవాలన్నారు. ఎంతో భవిష్యత్తు ఉన్న చిన్నారి అదే గ్రామంలో కలుషిత నీరు తాగి మృతి చెందిందన్నారు. తక్షణమే గ్రామంలో త్రాగునీరు పరిశుభ్రంగా వచ్చేలా చర్యలు తీసుకోవాలని, మురుగు నీరు పారుదల అయ్యేలా కాలువలు శుభ్రం చేయాలని మనోహర్ ఆదేశించారు. మండలంలో నిత్యం విద్యుత్ సమస్యలు ఉత్పన్నమౌతున్న గ్రామాలపై సంబంధిత అధికారుల ప్రత్యేక దృష్టిపెట్టి లైన్లు మరమ్మత్తులు చేసి నాణ్యమైన కరెంట్ అందేలా చూడాలన్నారు. విద్యాశాఖ అధికారిని నాడు-నేడు ద్వారా చేపట్టిన స్కూల్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్కూల్స్‌లో విద్యార్థులకు అందించే ఆహారం, చిక్కీలను డీటీ హెన్నా ప్రియను పరిశీలించి వాటి శాంపిల్స్ తీసుకోవాలన్నారు. విద్య వైద్యం ప్రతి ఒక్కరికీ అందాలని ఆయన ఆదేశించారు. నిత్యవసరాలు రేషన్ పంపిణీ వంటి విషయాలపై సంబంధిత అధికారులు పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలని ఇంటివద్దకు వచ్చి బియ్యం వంటివి అందించాల్సి ఉండగా రోడ్లపైనే డిస్ట్రిబ్యూషన్ చేయడం ఎంటని ప్రశ్నించారు. తెనాలి, కొల్లిపర మండలాల్లో ఖరీఫ్ సీజన్‌కు అనువుగా రైతాంగానికి సకాలంలో నీరు అందేలా కాలువలు మరమ్మత్తులు చేపించాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. వ్యవసాయశాఖ అధికారులు రైతులకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ రాయితీతో కూడిన విత్తనాలను, సాగులో మెళకవులను అన్నదాతలకు తెలుపుతూ పెట్టుబడులు తగ్గించి అధిక దిగుబడులు సాధించేలా బాధ్యతగా అధికారులు మెలగాలన్నారు. పింఛన్ పంపిణీ వంటివాటిని కూడా సకాలంలో అందించేలా అధికారులు బాధ్యతగా ఉండాలని కోరారు. ఎంపీడీవో కానూరు శిల్పా, ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు, వైస్ ఎంపీపీ కొడూరు స్వప్న, ఈవోపీఆర్డీ ప్రభాకర్, ఏవో ప్రేమసాగర్, పలుశాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రెవెన్యూశాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను సన్మానిస్తున్న మాజీ ఎంపి గల్లా జయదేవ్, మంత్రి అచ్చెంన్నాయుడు, టీడీపీ నాయకులు

మంత్రి అనగానికి మాజీ ఎంపీ గల్లా శుభాకాంక్షలు

రేపల్లె, జూన్ 23: రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్‌ను మరో రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడును మాజీ ఎంపీ గల్లా జయదేవ్ ఆదివారం విజయవాడలోని అచ్చెన్నాయుడి క్యాంపు ఆఫీసులో కలసి పుష్పగుచ్చం అందజేసి దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారితో జయదేవ్ మాట్లాడుతూ ఐదేళ్ళ వైసీపీ పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమైంద న్నారు.అందుకే ప్రజలు వైసీపీ ప్రభుత్వంపై తీవ్రమైన వ్యతిరేక తను వ్యక్తం చేస్తూ కూటమిని భారీ స్థాయిలో గెలిపించి అధికా రాన్ని కట్టబెట్టారన్నారు. ప్రజల ఆశలు, ఆకాంక్షల మేరకు, రాష్ట్ర అభివృద్ధి కోసం ఆహర్నిశలు పనిచేసి దేశం గర్వించదగ్గ స్థాయికి పాలనను అందించాలని ఆయన కోరారు. అలాగే రెవెన్యూ శాఖ మంత్రిని కోడెల శివరాం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సాంబశివరావు, ఉగ్గిరాల సీతారామయ్య, కోవెలమూడి నాని, డేగల ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.



మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కోడెల శివరాం

చెక్‌పోస్టు కార్యాలయం తొలగింపు..

- గత ప్రభుత్వ హయాంలో జీవో
- ఏటా రూ.కోట్లలో ఆదాయానికి గండి



పొందుగల గ్రామ సమీపంలోని రాష్ట్ర రవాణా చెక్‌పోస్టు కార్యాలయం

దాచేపల్లి, జూన్ 22: పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం పొందుగల రాష్ట్ర రవాణా చెక్‌పోస్టు కార్యాలయాన్ని వైసీపీ ప్రభుత్వం జీవో ఇచ్చి నిలిపివేసింది. రోజుకు 3 లక్షల రూపాయలకు పైగా ప్రభుత్వానికి ఆదాయం వచ్చే చెక్‌పోస్టును తొలగించడం వెనుక వైసీపీ నేతల పాత్ర వున్నట్లుగా తెలుస్తుంది. ఈ చెక్‌పోస్టు నుండి నిత్యం వందలాది వాహనాల రాకపోకలతో ప్రభుత్వానికి ఏడాదికి కోటి రూపాయలకు పైగా ఆదాయం లభిస్తుంది. దాచేపల్లి మండలం పొందుగల వద్ద కొన్ని ఏళ్లుగా ఆర్‌టీపీ (రోడ్డు ట్రాన్స్‌పోర్టు అథారిటీ) చెక్‌పోస్టు వుండేది. పరిమితికి మించిన లోడుతో వెళ్లే వాహనాలను ఇక్కడ తనిఖీ చేసి అపరాధ రుసుం విధించేవారు. తెలంగాణ - ఆంధ్రా సరిహద్దుల్లో ఈ చెక్ పోస్టు వుండటం వల్ల ప్రభుత్వానికి ఎంతో ఆదాయం వచ్చేది.

వైసీపీ అక్రమ రవాణాకు అడ్డుగా వుందన్న సాకుతో ఈ ఏడాది మార్చి 25న వైసీపీ ప్రభుత్వం జీవోతో చెక్‌పోస్టును నిలిపివేశారు. ఎన్నికల కోడ్‌కు ముందుగా వైసీపీ వాహనాలలో ఇసుక, గ్రానైట్ అక్రమంగా తరలించేందుకు ఈ చెక్‌పోస్టు అడ్డుగా వుందని జీవోతో చెక్‌పోస్టును నిలిపివేయించారు. చెక్‌పోస్టు లేకపోవడంతో ఇతర రాష్ట్ర వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆన్‌లైన్‌లో అందరూ అనుమతులు తీసుకోవడానికి వీలుపడని పరిస్థితులు వుంటాయి. ఇదే అదునుగా భావించిన మరికొందరు రాత్రి పగలు తేడాలేకుండా పన్నులు ఎగ్గొట్టి రాష్ట్ర హద్దులు దాటిపోతున్నారు.

ఇసుక మాఫియాకు అడ్డుగా వుందని సాకు ..

వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఇసుక మాఫియా రెచ్చిపోయిన సంగతి తెలిసిందే. కొందరు వైసీపీ ఎమ్మెల్యేలు కూడా వందలాది ఇసుక లారీలను రాష్ట్రం దాటించారు. ఇవికాక ప్రకాశం జిల్లా నుంచి వచ్చే గ్రానైట్ లోడు లారీలను కూడా పొందుగల మీదుగానే రాష్ట్ర సరిహద్దులు దాటేవి. తెలంగాణ మందు కూడా రాష్ట్రానికి వచ్చేది ఈ మార్గం నుండే. ఇటువంటి అక్రమ రవాణా వ్యవహారాలలో నాటి వైసీపీ నేతలు భారీగా నగదు తీసుకొని లారీలను దాటించారనే ఆరోపణలు వున్నాయి. చెక్‌పోస్టు వుంటే ఈ వ్యవహారాలకు అడ్డుగా వుంటుందనే ఆలోచనతో ఈ చెక్‌పోస్టు లేకుండా చేశారు.

రోజుకు 3 లక్షల రూపాయల ఆదాయం

పొందుగల చెక్‌పోస్టు వల్ల ప్రభుత్వానికి రోజుకు 3 లక్షల రూపాయలు ఆదాయం లభిస్తుంది. ప్రతిరోజు డజన్ల కొద్దీ కేసులు నమోదవుతాయి. రాత్రి పగలు తేడా లేకుండా అధికారులు తనిఖీలు నిర్వహించేవారు. దీనివల్ల ఎన్నో అక్రమ రవాణాలు వెలుగులోకి వచ్చేవి. ప్రస్తుత ప్రభుత్వమైనా చెక్‌పోస్టును తిరిగి ఏర్పాటు చేస్తే ప్రభుత్వానికి ఆదాయంతో పాటు అక్రమ రవాణాకు గండి పడుతుంది. ఈ విషయంపై స్థానిక ప్రజాప్రతినిధులు కూడా దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.



శ్రీవారిని దర్శించుకున్న అనంతరం మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

ఆంధ్రుల ఆకాంక్షల ఫలమే ప్రజా ప్రభుత్వం

- తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట అర్బన్, జూన్ 23: ఐదుకోట్ల ఆంధ్రుల ఆకాంక్షల ఫలమే నూతనంగా కొలువు దీరిన ప్రజా ప్రభుత్వం అని మాజీమంత్రి, తెలుగుదేశం పార్టీ సీనియర్ శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ఆదివారం వీఐపీ బ్రేక్ సమయంలో ప్రత్తిపాటి వారి కుటుంబ సభ్యులతో కలసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం వేద పండితులు ప్రత్తిపాటి దంపతులను ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం అలయ వెలుపుల మీడియాతో మాట్లాడుతూ పవన్, లోకేశ్‌ల సంకల్పం నాయకత్వాలే ఈ రాష్ట్రానికి శ్రీరామరక్షగా ఉంటాయన్నారు. అమరావతి, పోలవరం నిర్మాణాలు పూర్తి కావాలని, ప్రజా పాలన అందించాలని, రాష్ట్ర ప్రజలు కోరుకున్నట్లుగానే ఈనెల 12న ప్రమాణ స్వీకారం జరిగినప్పటి నుంచి మార్పు చూస్తున్నారన్నారు. ప్రజలు కోరుకున్న విధంగా ప్రజా పాలన అందించక పోతే ఏ విధమైన తీర్పు ఇస్తారో అనే దానికి 2024 ఎన్నికలే నిదర్శనమన్నారు. స్వామి వారిని దర్శించుకున్న వారిలో ప్రత్తిపాటితో పాటు చిలకలూరిపేట మునిసిపల్ ఫ్లోర్ లీడర్ గంగా శ్రీనివాసరావు, టీడీపీ నేతలు గంజి మోహన్, కందుల రమణ, గట్టినేని రమేష్, తోబాటి శ్రీహరి, జువ్వాజి బుచ్చిబాబు తదితరులు ఉన్నారు.

వైద్య కళాశాల వాటర్ పైపులు మాయం



లారీలో దిగుమతికి సిద్ధంగా వున్న వాటర్ పైపులు (ఫైల్‌ఫొటో)

పిడుగురాళ్ల, జూన్ 23: వైద్య కళాశాలకు నీటి సరఫరా అందించేందుకు దిగుమతి చేసిన వాటర్ పైపులను రాత్రికి రాత్రే గుర్తుతెలియని వ్యక్తులు దోచేశారు. వివరాల్లోకి వెళ్తే పిడుగురాళ్ల పురపాలక సంఘ పరిధిలోని పంపుహౌస్ నుంచి సుమారు 8 కిలోమీటర్ల దూరంలో నిర్మాణంలో వున్న మెడికల్ కళాశాల నీటి అవసరాలకు పైపలైన్‌ను కొంతకాలంగా ఏర్పాటు చేస్తున్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే సుమారు 5 కిలోమీటర్ల మేర పైపులైన్ పూర్తయింది. మిగిలిన 3 కిలోమీటర్లు దూరం పైపులైన్ వేస్తే మెడికల్ కళాశాల వరకు నీటిసరఫరా అవుతుంది. ఎన్నికలకు ముందు పైపులైన్‌కు అవసరమైన 220 పైపులను అయ్యప్పస్వామి దేవాలయం సమీపంలో రెండుచోట్ల మున్సిపల్ అధికారులు దిగుమతి చేశారు. కొంతకాలంగా అధికారులు ఎన్నికల పనుల్లో హడావుడిలో వున్నారు. ఆ కారణంగా నిలిచిపోయిన పైపులైన్ పనులను తిరిగి మొదలు పెట్టేందుకు సన్నద్ధమయ్యే దిశగా ఆదివారం పైపులైన్‌లను దిగుమతి చేసిన ప్రాంతానికి వెళ్లి చూడగా అక్కడ పైపులు కనిపించకపోవడంతో అధికారులు అవాక్కయ్యారు. అపహరణకు గురైన 220 పైపుల విలువ సుమారు రూ.31 లక్షలు వుంటుందని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. ఈ విషయంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు.

అహంకారం పతనానికి నాంది

- అధిక మెజారిటీ బాధ్యతను పెంచింది
- గురజాల ఎమ్మెల్యే యరపతినేని



మాట్లాడుతున్న గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, జూన్ 23: ప్రతి మనిషికి అహంకారం పతనానికి నాంది పలుకుతుందన్న విషయానికి వైసీపీ నేతల ప్రవర్తనే నిదర్శనమని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం బ్రాహ్మణపల్లిలో పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ సభ్యుల సమావేశంలో యరపతినేని మాట్లాడుతూ ఐదేళ్ల ప్రభుత్వ పాలనకు ట్రస్టీగా వుండాల్సిన పాలకులు అహంకారంతో విర్రవీగి నేతల కుటుంబసభ్యుల మనసు నొచ్చుకునేలా మాట్లాడిన సంస్కారం నీచ మైందన్నారు. 151 సీట్లు వచ్చాయన్న విర్రవీగుడు తనంతో ప్రవర్తించిన వైసీపీ ప్రభుత్వ నేతలకు చివరకు 11 సీట్లే పరిమితం అయ్యాయన్నారు వైసీపీ నేతల్లా ఏ ఒక్కరు ప్రవర్తించవద్దని, దాడులు చేయొద్దని, అలా ఎవరైనా చేస్తే తనకు ఫోన్‌చేయాలని యరపతినేని తెలిపారు. రానున్న ఐదేళ్ల కాలంలో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు. అయ్యప్పనగర్‌లో వున్న పిరమిడ్ ధ్యాన కేంద్రానికి మంచినీటి వసతి ఏర్పాటు చేయడమే కాకుండా మరి ఏ అవసరమైనా అందించేందుకు సిద్ధంగా వున్నానన్నారు. శాఖాహారం మనిషికి ఆరోగ్యాన్ని ఇస్తుందని, పిరమిడ్ సభ్యుల శిక్షణ ప్రతి వ్యక్తికి కొంత అవసరమైందని ఎమ్మెల్యే యరపతినేని తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలింపు

- మాజీ ఎంపీ నందిగం సురేష్ సోదరుడి కుమారుడిపై కేసు

విజయవాడ (విద్యాధరపురం), జూన్ 23 : గుంటూరు జిల్లా ఉద్దండరాయునిపాలెం నుంచి విజయవాడలోని భవానీపురానికి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మాజీ ఎంపీ నందిగం సురేష్ సోదరుడి కుమారుడు మణికంఠ, కనకమహాలక్ష్మి కాటా యజమాని చక్రవర్తి, టిప్పర్ డ్రైవర్ రాంబాబుపై ఆదివారం భవానీపురం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు ఒక టిప్పర్‌ను స్వాధీనం చేసుకుకొని పోలీసు స్టేషన్‌కు తరలించారు. గురువారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో ఉద్దండరాయుని పాలెం నుంచి భవానీపురం బైపాస్ రోడ్డు పక్కన మణికంఠ నిర్వహిస్తున్న స్టాండ్ వద్దకు ఎనిమిది ఇసుక లారీలు వచ్చాయి. విషయం తెలుసుకున్న భవానీపురానికి చెందిన తెలుగు యువత నాయకుడు చరణ్ స్టేషన్‌కు ఫోన్ చేసి సమాచారం అందించారు. ఆ తరువాత పోలీసులు, చరణ్, అతని స్నేహితులు లారీలను వెంబడించారు పోలీసుల రాకతో ఇసుక లోడుతో ఉన్న ఏడు లారీలు వేగంగా వెళ్లిపోయాయి. ఒక లారీ మాత్రం సితార థియేటర్ వెనుక ఖాళీ స్థలంలో పార్కింగ్ చేశారు. ఇది గమనించిన పోలీసులు అక్కడికి వెళ్లి డ్రైవర్ రాంబాబును అదుపులోకి తీసుకుని లారీని స్టేషన్‌కు తరలించారు. మణికంఠ, చక్రవర్తి, రాంబాబుపై కేసు నమోదు చేశారు. కాగా, అక్రమ ఇసుక రవాణాపై తాను ఇచ్చిన ఫిర్యాదును తీసుకోకుండా పోలీసులు తమంతట తామే కేసు నమోదు చేశారని చరణ్ ఆరోపించారు. కేసును నీరు గార్చేందుకు పోలీసులు అలా చేస్తున్నారన్నారు. దీనిపై ఎస్ఐ లాలం ప్రసాద్‌ను వివరణ కోరగా, తమకు అందిన సమాచారం మేరకే లారీలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.



కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఎన్‌సీసీ అధికారులు, విద్యార్థులు

కొండవీడుకోటలో ఏక్ భారత్.. శ్రేష్ఠ భారత్

- పాల్గొన్న రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఎన్‌సీసీ విద్యార్థులు

కొండవీడుకోట(యడ్లపాడు), జూన్ 23: యడ్లపాడు మండలంలోని చారిత్రక ప్రాంతమైన కొండవీడుకోటలో ఏక్ భారత్.. శ్రేష్ఠ భారత్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన 600 మంది ఎన్‌సీసీ విద్యార్థులు, 30 మంది అధికారుల బృందం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కోనేరు లక్ష్మయ్య ఇంజనీరింగ్ కళాశాలలోని బేస్ క్యాంపు వద్ద నుంచి 13 బస్సులలో కొండవీడుకు చేరుకున్న వీరంతా అవుట్‌రైవల్ ట్రెక్కింగ్ అకాడమీవారి సహాయంతో ట్రెక్కింగ్, దలవాయి ఆషా రాఫిలింగ్ వంటి సాహస కృత్యాలలో పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు బృందాలుగా ఏర్పడి సమైక్యతా పరుగును నిర్వహించారు. ఈ సందర్భంగా కల్నల్ చంద్రశేఖర్ మాట్లాడుతూ సమైక్యతను పెంపొందించేందుకు ఏక్ భారత్.. శ్రేష్ఠ భారత్ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. కొండవీడుకోట అభివృద్ధి కమిటీ కన్వీనర్ కల్లి శివారెడ్డి ఈ ప్రాంత చారిత్రక ప్రాశస్త్యాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కల్నల్ సిద్ధు, కల్నల్ సుదర్శన్, కొండవీడు బీట్ అధికారులు రాజు, కె వెంకటేశ్వరరావు, అవుట్‌రైవల్ ఎడ్వంచర్స్ అకాడమీకి చెందిన దళవాయి ఆషా, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎన్‌సీసీ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కూటమి గెలిచింది.. మొక్కు తీరింది

- దుర్గాదేవి అమ్మవారిని దర్శించున్న రాజధాని రైతులు



రైతులతో పాటు అమ్మవారి చీర సారెతో అమ్మవారి సన్నిధికి వస్తున్న ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్

తుళ్లూరు, జూన్ 23: కూటమి గెలుపుతో వైసీపీ అరాచక పాలన అంతమైందని రాజధాని అమరావతి రైతులు, రైతు కూలీలు, మహిళలు అన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కావటంతో వారంతా ఆదివారం విజయవాడ ఇంద్రకీలాద్రిపైన ఉన్న కనక దుర్గమ్మ అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. తెల్లవారు జామున 4 గంటలకే అమ్మవారి దర్శనానికి కాలినడకన తుళ్లూరు రైతు శిబిరం నుంచి బయలు దేరారు. రైతు జేఏసీ నేత పువ్వాడ సుధాకరరావు పలువురు రైతు నాయకులు దిష్టితీసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మార్గ మధ్యంలో పలు రాజధాని గ్రామాల రైతులు, మహిళలు కలిశారు. తాడేపల్లి మండలం సీతానగరం ప్రకాశం బ్యారేజ్ వద్ద తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ రైతులకు ఎదురేగి స్వాగతం పలికారు. అక్కడ నుంచి అమ్మవారి చీర సారె పట్టుకొని కాలి నకడకన అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా శ్రావణ్ మాట్లాడుతూ వైసీపీ అరాచక పరిపాలనతో అమరావతి రైతులతో పాటు రాష్ట్ర ప్రజలు కూడా విసిగిపోయారన్నారు. ఎక్కడ చూసినా దాడులు దమన కాండ తప్పితే అభివృద్ధి లేకపోవటంతో ప్రజలు తిరగబడ్డారన్నారు. ముఖ్యంగా రాజధాని అమరావతి రైతుల పట్ల వైసీపీ ప్రభుత్వం వ్యవహరించిన తీరు దారుణమన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ధనేకుల సుబ్బారావు, పలువురు టీడీపీ నేతలు, రైతు జేఏసీ నేతలు పువ్వాడ సుధాకరరావు, కాటా అప్పారావు, గొర్నేని స్వరాజ్యారావు, కొండెపాటి బుజ్జి, ఉప్పలపాటి సాంబశివరావు మహిళా జేఏసీ సభ్యులు, రాజధాని 29గ్రామాలకు చెందిన మహిళలు, రైతులు, రైతు కూలీలు పాల్గొన్నారు. పువ్వాడ భరత్ అనే రైతు పొంగళ్ల పాత్రను 25 కిలో మీటర్లు దించకుండా అమ్మవారి సన్నిధికి చేర్చారు.

రేషన్ డీలర్ల హక్కులను పరిరక్షించాలి

- రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు వైఏబీ



పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ని కలిసిన రేషన్ డీలర్ల సంఘం నాయకులు

గుంటూరు సిటీ, జూన్23: ఆహార భద్రత చట్టంలో ఉన్న రేషన్ డీలర్లకు సంబంధించిన హక్కులను పరిరక్షించాలని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు వైఏబీ ప్రసాదరావు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన ఆధ్వర్యంలో రేషన్ డీలర్లు తెనాలిలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ని కలిసి పలు సమస్యలను నివేదించారు. ఈ సందర్భంగా డీలర్లు మాట్లాడుతూ తమకు కూడా లాగిన్ ఇప్పించి 365 రోజులు పని చేయించుకుని కనీస వేతన చట్టం అమల్లోకి తీసుకువచ్చి కమిషన్‌తో కూడిన గౌరవ వేతనం చెల్లించాలన్నారు. ఎంఎల్ఎస్ పాయింట్‌లో రేషన్ డీలర్లకు సరుకు ఎగుమతి చేసేటప్పుడు డీలర్ సమక్షంలోనే ఖచ్చితమైన తూకం వేసి సరుకు లిఫ్టింగ్ జరిగే విధంగా చూడాలన్నారు. కరోనా సమయంలో చనిపోయినటువంటి రేషన్ డీలర్లకు ఎక్స్‌గ్రేషియా ఇప్పించాలని, కొంతమంది ఎండీయూలు రేషన్ డీలర్లకు రిటర్న్ స్టాక్ చేయు సమయంలో డబ్బులు, సరుకులు ఇచ్చు సమయములో ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని వివరించారు. దీనిపై మంత్రి మనోహర్ స్పందిస్తూ తాను త్వరలోనే ఒక సమావేశం ఏర్పాటు చేసి అన్ని సమస్యలను చర్చిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ వివిధ మండలాల అధ్యక్ష కార్యదర్శులు, పలువురు డీలర్లు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	136, 147,156
చికెన్ విత్ స్కిన్	260.00
చికెన్ స్కిన్ లెస్	270.00

నూతన భవన సముదాయానికి రూ.6 లక్షల విరాళం


పాలకవర్గ సభ్యులకు చెక్కును అందజేస్తున్న దామా మహేశ్వరరావు

గుంటూరు(తూర్పు), జూన్ 23: జేకేసీ రోడ్డులోని కమ్మజనసేవా సమితి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న భవన సముదాయంలో ఒకగది నిర్మాణానికయ్యే ఖర్చు మొత్తాన్ని రూ.6లక్షల విరాళాన్ని స్థానిక గుంటూరు, నలందనగర్‌కు చెందిన దామా మహేశ్వరరావు ప్రకటించారు. ఆదివారం, కుందులరోడ్డులోని కమ్మజనసేవాసమితి బాలికల వసతి గృహంలో సమితి అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావుకు ఆయన చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా దామా మహేశ్వరరావు మాట్లాడుతూ పారదర్శకత, విద్యార్థినులకు రక్షణ, పరిశుభ్రమైన భోజనం అందిస్తున్న కమ్మ జనసేవ సమితి సేవలు అభినందనీయమని అన్నారు. సామినేని కోటేశ్వరరావు మాట్లాడుతూ నూతన భవన నిర్మాణం మొదలైందని త్వరలోనే పూర్తిచేసి అందుబాటులోకి తీసుకువస్తామని అన్నారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు వడ్లమూడి నాగేంద్రం, గోరంట్ల పున్నయ్య చౌదరి, గుంటుపల్లి కోటేశ్వరరావు, పెద్ది సాంబశివరావు, వడ్లమూడి శివరామకృష్ణయ్య, రాయపాటి గోపాలకృష్ణ, ఘంటా పున్నారావు పాల్గొన్నారు.

జగన్ మానసిక స్థితి సరిగాలేదు : కనపర్తి శ్రీనివాసరావు


కనపర్తి శ్రీనివాసరావు

గుంటూరు, జూన్ 23(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి మానసిక పరిస్థితి సరీగా లేదని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు అనుమానం వ్యక్తం చేశారు. పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'జగన్ అనే వ్యక్తి రాజకీయాల్లో అంత నిజాయితీగా ఉంటే ఎలా అని ప్రజలు అనుకుంటున్నారని' తనకు తాను కీర్తించుకోవటం చూస్తుంటే ఆయన మానసిక పరిస్థితి సరిగా లేదన్న అనుమానాలు కలుగుతున్నాయని అన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా, నియమ నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ స్థలాల్లో నిర్మిస్తున్న వైసీపీ కార్యాలయాలన్నింటినీ వెంటనే కూల్చివేయాలని అన్నారు. పట్టుమని పన్నెండు సీట్లు కూడా గెలవలేని వైఎస్ జగన్మోహనరెడ్డి 2029 ఎన్నికల్లో అధికారంలోకి వస్తామని మాట్లాడటం సిగ్గుచేటని విమర్శించారు. జగన్‌రెడ్డి లాంటి విపరీత మనస్తత్వం ఉన్న నియంత చేతికి అధికారం వస్తే ప్రజలు, ప్రజాస్వామ్యం మనుగడ సాగించటం కష్టమని అన్నారు. కొడాలి నాని, వంశీ, రోజా లాంటి వ్యక్తుల చేత చంద్రబాబుని, జగన్ అనరాని మాటలు అనిపించటం వలెనే తమ పార్టీ అసెంబ్లీలో అడ్రస్ వెతుక్కోవాల్సిన ఖర్మ పట్టిందని వైసీపీ నేతలే బహిరంగంగా మాట్లాడటం చూసి ఆ నేతలు సిగ్గుపడాలన్నారు. సొంత తల్లీ, చెల్లే నమ్మని జగన్ను ప్రజలెలా నమ్ముతారని ఆయన ప్రశ్నించారు. అక్రమాస్తులు, ఈడీ కేసుల్లో శిక్ష తప్పదని తెలుసుకున్న జగన్, ఆ నెపం టీడీపీ కూటమి మీద నెట్టి ప్రజల్లో సానుభూతి పొందటానికి అప్పుడే ప్రణాళికలు రచిస్తున్నాడని కనపర్తి విమర్శించారు.

అండర్-16 బాలుర క్రికెట్ జట్టు రాష్ట్ర స్థాయి ఎంపికలు

గుంటూరు(తూర్పు), జూన్ 23: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నుంచి జూలై 24వ తేదీ వరకు నెల రోజుల పాటు అండర్-16 బాలుర విభాగంలో అంతర జిల్లాల క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్టు ది గుంటూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి డి.రమేష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పోటీల్లో మొత్తం 13 జట్లు పాల్గొంటాయన్నారు. పోటీలను పేరేచర్ల, మంగళగిరి, నరసరావుపేట మైదానాల్లో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా పేరేచర్ల, ఏసీఏ మైదానంలో గుంటూరు, చిత్తూరు, కడప, తూర్పుగోదావరి, శ్రీకాకుళం, విశాఖపట్నం, కర్నూలు జిల్లా జట్లు పోటీపడతాయని వివరించారు. పోటీల నుంచి ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అండర్- 16 బాలుర జట్టును ఎంపిక చేస్తుందన్నారు.

తెలుగుదేశం ప్రభుత్వంలోనే మహిళలకు రక్షణ

● గుడిపల్లి వాణి

గుంటూరు, జూన్ 23(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం ప్రభుత్వంలోనే మహిళలకు రక్షణ ఉంటుందని మరొకసారి రుజువైందని తెలుగుమహిళ రాష్ట్ర కార్యదర్శి గుడిపల్లి వాణి అన్నారు. ఆ మేరకు ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. బాపట్ల వద్ద జరిగిన యువతి అత్యాచారం, హత్య ఘటనను 48 గంటల్లోనే ఛేదించి, నిందితులను పట్టుకున్నారని తెలిపారు. గత ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేదని, మహిళలపై జరిగిన అత్యాచారాలకు, హత్యలకు గానీ అప్పటి ప్రభుత్వం స్పందించలేదని, వాటి మీద కూడా రాజకీయాలు చేశారని ఆమె ఆరోపించారు. బాపట్ల అత్యాచార ఘటనలో నిందితులు గంజాయి మత్తులో ఉన్నట్లు గుర్తించారని, ఆంధ్రప్రదేశ్‌ని గంజాయిప్రదేశ్‌గా మార్చిన జగనే అందుకు బాధ్యత వహించాలని ఆమె డిమాండ్ చేశారు. రాష్ట్రంలో గంజాయి తాగే వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని, తెలుగుదేశం ప్రభుత్వం ప్రజలకు సుభిక్షమైనా శాంతి యుతమైన పాలన అందించడమే లక్ష్యంగా పనిచేస్తుందని వివరించారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

● సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై నేతాజీ

గుంటూరు(తూర్పు), జూన్ 23: కార్మికుల సమస్యల పరిష్కారానికి నూతన ప్రభుత్వం కృషి చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై నేతాజీ అన్నారు. ఆదివారం పాత గుంటూరు సీఐటీయూ కార్యాలయంలో రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా స్కీం వర్కర్ల వేతనాలు పెంచాలని కోరారు. షెడ్యూల్ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికుల వేతన సవరణ చేయాలన్నారు. రాజధాని నిర్మాణంలో స్థానిక కార్మికులకు పని కల్పించాలని కోరారు. పరిశ్రమల్లో కార్మిక చట్టాలు అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ శిక్షణ శిబిరానికి ఎస్‌కే హుస్సేన్ వలి ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దండా లక్ష్మీ నారాయణ, నాయకులు బి.లక్ష్మణరావు, బి.ముత్యాలరావు, ఎస్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సిబార్ డెంటల్ కళాశాల చైర్మన్ రవీంద్రనాథ్ మృతి


డాక్టర్ రవీంద్రనాథ్ ఠాగూర్ (ఫైల్)

పెదకాకాని, జూన్ 23 : తక్కెళ్ళపాడు సిబార్ దంత వైద్య కళాశాల చైర్మన్ డాక్టర్ అట్లూరి రవీంద్రనాథ్ ఠాగూర్ (81) మృతి చెందారు. రెండు రోజులుగా ఆయన అనారోగ్యానికి గురై విజయవాడలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తుది శ్వాస విడిచారు. ఠాగూర్ సిబార్ కాలేజీతో పాటు విజయవాడ ఏలూరు రోడ్‌లోని కొత్త వంతెన సెంటర్లో అశ్విని నర్సింగ్ హోమ్ స్థాపించారు. ఆయన భార్య డాక్టర్ దుర్గారాణి, ఇద్దరు కుమారులు డాక్టర్ వినయ్, డాక్టర్ శ్రీకాంత్‌లు ఉన్నారు. 196లో గుంటూరు మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్, ఎంఎస్ పూర్తి చేశారు. కుటుంబం అంతా కూడా వైద్య రంగంలోనే ఉన్నారు. డాక్టర్ ఠాగూర్ మృతికి సిబార్ డెంటల్ కళాశాల చీఫ్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎల్ సుబ్బారావు, డీన్ డాక్టర్ ఎల్ కృష్ణ ప్రసాద్, కళాశాల అధ్యాపకులు, విజయవాడ వైద్యులు సంతాపం వ్యక్తం చేశారు. నేడు విజయవాడలోని దుర్గా అగ్రహారం నుంచి ఉదయం 11 గంటలకు అంతిమయాత్ర బయలుదేరుతుందని కుటుంబసభ్యులు తెలిపారు.

గుణదలకు పాదయాత్ర


కాలి నడకన గుణదల మేరిమాత చర్చికి వెళుతున్న రాజధాని ప్రాంత ఎస్సీలు

తుళ్లూరు, జూన్ 23: వైసీపీ దరిద్రపు పాలన వదిలించుకున్నామంటూ రాజధాని ఎస్సీ రైతులు, కూలీలు ఆదివారం విజయవాడ గుణదల వరకు పాద యాత్ర చేసి మేరి మాత అమ్మవారిని దర్శించుకున్నారు. రాజధాని అమరావతికి భూములిచ్చిన వారిలో 30 శాతం ఎస్సీ రైతులున్నారు. వారికి కూడా కౌలు ఇవ్వకుండా జగన్‌రెడ్డి ఇబ్బందులు పెట్టాడు. కూటమి గెలిచి చంద్రబాబు ముఖ్యమంత్రి కావటంతో ఎస్సీ రైతుల ముఖంలో చిరునవ్వు కనబడింది. నా ఎస్సీలు అనటం తప్పితే ఏనాడు జగన్‌రెడ్డి న్యాయం చేసింది లేదని ఈ సందర్భంగా వారు పేర్కొన్నా రు. ఎస్సీలపై దాడులు పెరిగాయన్నారు. అందుకే ఓటుతో బుద్ధి చెప్పామని వారు పేర్కొన్నారు.

చంద్రబాబు పాలనలోనే మహిళలకు రక్షణ

మంగళగిరి సిటీ, జూన్ 23: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పరి పాలనలోనే మహిళలకు రక్షణ, భరోసా ఉంటాయని తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య, రాష్ట్ర కార్యదర్శి వింజమూరి ఆషాబాల అన్నారు. మంగళగిరి టీడీపీ కార్యాలయం డాక్టర్ ఎమ్మెస్సెస్ భవన్‌లో ఆది వారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. చీరాల మండలం ఈపురుపాలెంలో చేనేత సామాజిక వర్గానికి చెందిన యువతిపై అత్యాచారం, హత్య చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాలతో హోంమంత్రి వంగలపూడి అనిత బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.పది లక్షల ఆర్థికసాయం అందించారని తెలిపారు. 48 గంటల్లో నిందితులను అరెస్టు చేస్తామని ప్రకటించి 36 గంటల్లోనే నిందితులను పట్టు కోవడం అభినందించదగ్గ విషయమన్నారు. ఈ సమావేశంలో తెలుగుమహిళలు యలమంచిలి పద్మజ, పోలు దుర్గ పాల్గొన్నారు.

పారిశ్రామికంగా జిల్లాని తీర్చిదిద్దాలి

● కేంద్ర మంత్రి వర్మకు బీజేపీ జిల్లా నేతల విజ్ఞప్తి


కేంద్ర మంత్రి భూపతిరాజు వర్మని కలిసిన బీజేపీ జిల్లా నేతలు

గుంటూరు సిటీ, జూన్ 23: సహజ వనరులకు నిలయమైన ఉమ్మడి గుంటూరు జిల్లాని పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలని కేంద్ర మంత్రి భూపతి రాజు వర్మకు బీజేపీ జిల్లా నాయకులు విజ్ఞప్తి చేశారు. ఆదివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఆయన్ని కలిశారు. ఈ సందర్భంగా వారు కేంద్రమంత్రితో మాట్లాడుతూ జిల్లాలో భారీ పరిశ్రమలు స్థాపించినట్లయితే రాజధాని ప్రాంతం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఇక్కడ పెట్టుబడులు పెట్టడానికి సానుకూలమైన వనరులు కూడా ఉన్నాయని అన్నారు. గత ప్రభుత్వం ఈ ఐదు సంవత్సరాలలో చేసిన విధ్వంసం మూలంగా యువతకు సరైన ఉపాధి అవకాశాలు లేకపోవడం వల్ల వారందరూ నిరుద్యోగులుగా మారిపోయారన్నారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో జిల్లా ఇన్‌ఛార్జ్ తమనంపూడి రామకృష్ణారెడ్డి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు నడ్డి నాగమల్లేశ్వరి, జిల్లా అధికార ప్రతినిధి చావలి పద్మ, మహిళా నాయకులు సుకన్య, మహాలక్ష్మీ తదితరులున్నారు.

బీజేపీ జిల్లా కార్యాలయంలో బలిదాన్ దివస్

బీజేపీ జిల్లా కార్యాలయంలో జన్‌సంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని బలిదాన్ దివస్ కార్యక్రమంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర మాట్లాడుతూ ప్రతీ ఒక్క బీజేపీ కార్యకర్త శ్యాంప్రసాద్ ముఖర్జీ జీవిత చరిత్రని చదివి వారి ఆలోచన విధానాన్ని అర్థం చేసుకోవాలన్నారు. అలానే ఆయన అడుగుజాడల్లో నడవాలన్నారు. పార్లమెంట్ కన్వీనర్ బీమినేని చంద్రశేఖర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ జమ్మూకశ్మీర్ స్వయంప్రతిపత్తిని ఆనాడే శ్యాం ప్రసాద్ ముఖర్జీ వ్యతిరేకించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గాజుల వెంకయ్య నాయుడు, ఈదర శ్రీనివాసరెడ్డి, అన్నా పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి కేంద్రమంత్రి పెమ్మసాని ప్రత్యేక ప్రణాళికలు

● మంత్రికి పాటిబండ్ల విష్ణువర్ధన్ అభినందనలు


కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌ను కలిసి అభినందనలు తెలుపుతున్న పాటిబండ్ల విష్ణువర్ధన్, నాగేశ్వరరావు తదితరులు

గుంటూరు(కార్పొరేషన్), జూన్ 23: గుంటూరు జిల్లా అభివృద్ధికి కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ప్రణాళికలు రూపొందిస్తారని పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ (సీబీఎస్ఈ) సెక్రటరీ, కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. కేంద్రమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖరరావుని ఆదివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పాటిబండ్ల విష్ణువర్ధన్ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమాన్ని కాంక్షిస్తూ పెమ్మసాని జిల్లా అభివృద్ధికి బాటలు వేస్తారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పాటిబండ్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణుల కోసం పరితపించిన రామ్మూర్తికి నివాళి

● కనకాచారి, వేములకొండ శ్రీనివాస్


రామ్మూర్తి విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న నేతలు

గుంటూరు, జూన్ 23(ఆంధ్రజ్యోతి): విశ్వ బ్రాహ్మణుల సంక్షేమం కోసం పరితపించిన మహనీయుడు గానాల రామ్మూర్తి అని విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సింహాద్రి కనకాచారి, టీడీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్ కొనియాడారు. మాజీ ఎమ్మెల్సీ పండిత రావుసాహెబ్ గానాల రామ్మూర్తి 87వ వర్ధంతి సందర్భంగా లాడ్జిసెంటర్లోని ఆయన విగ్రహానికి ఆదివారం పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో విశ్వ బ్రాహ్మణులకు సముచిత స్థానం వచ్చేలా కృషి చేసిన మహనీయుడు గానాల రామ్మూర్తి అని కొనియాడారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఎమ్మెల్సీగా పనిచేసిన రామ్మూర్తి విశ్వ బ్రాహ్మణులను ఓసీ జాబితా నుంచి బీసీ జాబితాలోనికి చేర్పించి ఆర్థిక, సామాజిక పురోగతికి ఎంత గానో కృషి చేశారన్నారు. జాతి అభివృద్ధికి కారకుడైన మహోన్నత వ్యక్తి అని, ఆయన ఆశయాలు కొనసాగించాలని, ఆయన వారసత్వంలో రాజకీయ ప్రాధాన్యం కోసం అందరూ పోరాటం చేసి, ఐక్యతతో చట్ట సభల్లో విశ్వబ్రాహ్మణ ప్రాతినిధ్యం తప్పక అవసరమని ఆ దిశగా మనందరం కలిసి మెలిసి శంఖారావాన్ని పూరించాలని అన్నారు. కార్యక్రమంలో పదిర ఈశ్వరాచారి, పామర్తి మోహన్ రావు, బసవ పాత్ర, మల్లికార్జున అత్తలూరు వీరబ్రహ్మంగా, కొంకెపూడి కోటేశ్వరావు, ముంజంపల్లి శివకుమార్, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

సమాజ హితమే ధ్యేయంగా ఉమ్మడి పౌరస్మృతి రావాలి

● సమాలోచన సదస్సులో వక్తలు


సదస్సులో పాల్గొన్న యశ్వంత్‌కుమార్, తులసీయోగేష్, డొక్కా మాణిక్య వరప్రసాద్ తదితరులు

గుంటూరు(విద్య), జూన్ 23: సమాజ వికాసం కోసం ఉమ్మడి పౌరస్మృతి (కామన్ సివిల్‌కోడ్) ఉపయోగపడాలని, దానిని దుర్వినియోగం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని టుబాకో బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్ అన్నారు. ఆదివారం అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో సమాలోచన సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. సదస్సుకు శ్రీమేధా చైర్మన్ అన్నా నందకిషోర్ అధ్యక్షత వహించారు. యశ్వంత్‌కుమార్ మాట్లాడుతూ అభివృద్ధే ధ్యేయంగా కామన్ సివిల్ కోడ్ ఉండాలని సూచించారు.. 'రాకా లోకం' చీఫ్ ఎడిటర్ రాకా సుధాకర్ మాట్లాడుతూ ఆంగ్లేయులు ప్రత్యేక పౌర చట్టం ద్వారా భారతీయ సమాజంలో విభజన తీసుకువచ్చారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తులసీ గ్రూపు సంస్థల ఎండీ తులసి యోగీష్ చంద్ర మాట్లాడుతూ ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేయటం ద్వారా భావాత్మక ఏకత సాధించవచ్చునన్నారు మహిళా సాధికారత, న్యాయమైన వారసత్వ, వివాహ, హక్కుల సార్వజనీనత వంటి అంశాల గురించి ఆయన వివరించారు. మాజీ ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్, న్యాయవాదులు జూపూడి రంగరాజు గారు, బ్రహ్మానందరెడ్డి, కిడాంబి దేవరాజన్ ముఖర్జీ లక్ష్మణ్, మన్నవ బాలచంద్ర, కృష్ణమోహన్ తదిత రులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సంస్కృతి యువనాటికలు గ్రంథావిష్కరణ


గ్రంథావిష్కరణలు చేస్తున్న విజయభాస్కర్, సాయిమాధవ్, ఆచార్య సత్యనారాయణ తదితరులు

గుంటూరు, జూన్ 23: యువత అభిరుచి సామర్థ్యానికి తగిన రచనలను రచయితలు అందించాలన్న ఆకాంక్షతో సంస్కృతి గుంటూరు సంస్థ యువనాటికల పోటీలు నిర్వహించి, కొత్త రచనలు ఎంపిక చేసి యువ నాటికల సంకలనాన్ని రూపొందించింది. సంస్కృతి యువ నాటికల సంకలన పుస్తకావిష్కరణ కార్యక్రమం గుంటూరులోని విజ్ఞాన మందిరంలో ఆదివారం జరిగింది. సంస్కృతి యువ నాటికలు పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథి, ఆవిష్కరణ కర్తగా ప్రముఖ నాటక రచయిత డాక్టర్ దీర్ఘాసి విజయభాస్కర్, చలనచిత్ర రచయిత బుర్ర సాయిమాధవ్, కందిమళ్ళ సాంబశివరావు, అభో విభో కందాళం ఫౌండేషన్ అధ్యక్షుడు ఆచార్య అప్పాజోశ్యుల సత్యనారాయణ, సంస్కృతి గుంటూరు వ్యవస్థాపకులు సర్రాజు బాలచందర్, రచయిత పిన్నమనేని మృత్యుంజయరావు, మోదుగుల రవికృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా చలనచిత్ర రచయిత బుర్ర సాయిమాధవ్ మాట్లాడుతూ కళలు కూడా సమాజంలో భాగం అని సమాజం కోసం అవి ఉపయోగపడతాయన్నారు. పాఠశాలలు, తల్లిదండ్రులు యువతను నాటకం రంగం వైపు ప్రోత్సహించాలని కోరారు. దీర్ఘాసి విజయభాస్కర్ మాట్లాడుతూ తెలుగు నాటక రంగంలో యువత పాత్రను ప్రోత్సహించేలా సంస్కృతి గుంటూరు చేస్తున్న కృషి ప్రశంసనీయమని అన్నారు. సంస్కృతి బాలచందర్ కృషి నాటక రంగానికి ఎనలేనిదని ప్రశంసించారు. కార్యక్రమంలో సంస్కృతి సంస్థ నిర్వహించిన యువ నాటిక పోటీల్లో విజేతలకు పురస్కారాలు అందించారు. అనంతరం వల్లూరి శివప్రసాద్ రచించిన ఉన్మాదం నాటక ప్రదర్శన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది.

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి

● టీడీపీ రీసెర్చ్ కమిటీ సభ్యుడు గంగాధర్ డిమాండ్

● జగన్, మాజీ మంత్రులపై పోలీసులకు ఫిర్యాదు

మంగళగిరి సిటీ, జూన్ 23: విశాఖ రుషికొండపై నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరిగాయని, అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని టీడీపీ రీసెర్చ్ కమిటీ సభ్యుడు టీ.గంగాధర్ డిమాండ్ చేశారు. ఈ మొత్తం వ్యవహారాన్ని నడిపించిన మాజీ సీఎం జగన్, నాటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి, మాజీమంత్రులపై కేసులు నమోదు చేయాలని కోరుతూ ఆదివారం ఆయన మంగళగిరి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గంగాధర్ మీడియాతో మాట్లాడుతూ రుషికొండపై పర్యాటక శాఖకు చెందిన రూ.కోట్ల విలువ చేసే భవనాలను కూల్చివేసి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. రుషికొండపై హోటళ్ల నిర్మాణం పేరుతో 2021, జూలై 6న పిలిచిన టెండర్లలో రెండు సంస్థలు పాల్గొనగా డీఈసీ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నారని చెప్పారు. 9.88 ఎకరాల విస్తీర్ణంలో హోటళ్ల నిర్మాణం జరుగుతున్నట్టు పేర్కొనడంతోపాటు జీవో నెం.5 ద్వారా రూ.421.87 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. హోటల్ నిర్మాణం మొదలుపెట్టే ముందే అన్ని అనుమతులు తీసుకున్నట్టు కోర్టులకు తప్పుడు నివేదిక ఇచ్చారని, పర్యావరణ చట్టాలు, ఉత్తర్వులను ఉల్లంఘించి నిర్మాణాలు చేపట్టారని అన్నారు. రుషికొండపై గతంలో వున్న 58 పడకలతో కూడిన రిసార్ట్‌ను కూడా అక్రమంగా కూల్చివేశారన్నారు. అదే సమయంలో కొత్త నిర్మాణాల పేరిట రూ.420 కోట్లకు పైగా ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేశారని, అన్ని అనుమతులు, నిబంధనలను ఉల్లంఘించారని ఆరోపించారు. మాజీ సీఎం జగన్‌తోపాటు మాజీమంత్రులు, అధికారులపై తక్షణమే ఐపీసీ సెక్షన్ 409 కింద కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని గంగాధర్ డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మంగళగిరి, జూన్ 23: విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని డీఈఈ అక్కుల సత్యనారాయణ తెలిపారు. నవులూరు గ్రామ పరిధిలోని ఈఎస్ఆర్ గార్డెన్స్, గోలి వారి తోట, మక్కెవారి పేట, బాపనయ్య నగర్ ప్రాంతాల్లో ఉద యం 9 నుంచి 11 గంటల వరకు, ఉడా కాలనీ, శిబిరం, బాపూజీనగర్, టిడ్కో ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సర ఫరా నిలిపివేస్తారని, ప్రజలు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

విద్యతోనే వడ్డెర్ల అభ్యున్నతి

● సంక్షేమ సంఘ ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాసరావు

గుంటూరు(తూర్పు), జూన్ 23: వడ్డెర్ల స్థితిగతులను మెరుగుపరచడానికి విద్య అవసరమని వడ్డెర్ల ఉద్యోగ సంక్షేమ సంఘ ప్రధాన కార్యదర్శి డాక్టర్ తన్నీరు శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం, స్థానిక సీతయ్య డొంకలో ఓ కల్యాణ మండపంలో వడియరాజుల ఉద్యోగ సంక్షేమ కార్యవర్గ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలని నూతన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అంతేగాక రాజధానిలో వడ్డెర్లకు కమ్యూనిటీ భవనం, జిల్లాలో సంచార జీవనం సాగిస్తున్న పిల్లలకు వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. నూతన ప్రభుత్వం మరోసారి సత్యపాల్ కమిటీ వేసి వడ్డెర్ల స్థితిగతులపై నివేదిక రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సంఘ గౌరవ సలహాదారు డాక్టర్ చిన్నహుసన్, అధ్యక్షుడు చల్లా పిచ్చయ్య, గౌరవ అధ్యక్షుడు టీ శ్రీనివాసరావు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవుల్లో కాపులకు ప్రాధాన్యం కల్పించాలి

● కాపు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వేల్పూరి శ్రీనివాసరావు

గుంటూరు(తూర్పు), జూన్ 23: నామినేటెడ్ పదవుల కేటాయింపులో కాపులకు ప్రాధాన్యం కల్పించాలని నూతన ప్రభుత్వానికి సౌత్ ఇండియన్ కాపు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వేల్పూరి శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశాడు. ఆదివారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సెంటర్లోని సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ ఓటమిలో కాపులు కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. అనేక వేధింపులకు గురిచేసిన వైసీపీకి కాపులు బుద్ధి చెప్పారని అన్నారు. గత టీడీపీ పాలనలో కాపులకు రిజర్వేషన్లు కల్పించాలనే లక్ష్యంతో చంద్రబాబు కృషి చేశారని గుర్తుచేశారు. తిరిగి రిజర్వేషన్లు కల్పించేలా కార్యాచరణ రూపొందించాలని చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లకు విజ్ఞప్తి చేశారు.

పంచాయతీల పటిష్టానికి పెమ్మసాని కృషి చేయాలి

తాడేపల్లి, జూన్ 23: గ్రామణాభివృద్ధికి కృషి చేయడం ద్వారా పంచాయతీల పటిష్టతకు గ్రామ స్వరాజ్య స్థాపనకు కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కృషి చేస్తారని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు ఆశాభావం వ్యక్తం చేశారు. తాడేపల్లిలోని మంత్రి స్వగృహంలో బీసీ సంక్షేమ సంఘ నాయకులు చంద్రశేఖర్‌ను కలిసి ఆదివారం గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నేతలు తన్నీరు ఆంజనేయులు, అన్నవరపు నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు అండగా ఉంటా : నసీర్


నోటు పుస్తకాలు ప్రదర్శిస్తున్న నసీర్

గుంటూరు, జూన్ 23(ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు అండగా ఉంటానని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ చెప్పారు. పొన్నూరు రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో వాసవి క్లబ్, అర్బన్ ఆర్య వైశ్య సంఘం నేతలు నసీర్‌కు నోట్ పుస్తకాలు ఇచ్చి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన పిలుపు నందుకుని పుష్పగుచ్ఛానికి బదులుగా 1000 నోటు పుస్తకాలు అందజేసిన వారిని నసీర్ అభినందించారు. పేద విద్యార్థుల చదువు కోసం ఇలా సహాయం చేయాలని ఆలోచన ఎమ్మెల్యే నసీర్‌కు రావడం చాలా ఆనందంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గుంటూరు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ట్రెజరర్ బొల్లిశెట్టి బాపారావు, రిజియన్ చైర్‌పర్సన్ బొల్లిశెట్టి వెంకటేశ్వరరావు, తెలుగుదేశం గుంటూరు పార్లమెంట్ ట్రెజరర్ కొనకాళ్ల సత్యం, కోట వెంకట శివ శేషగిరిరావు, బొల్లిశెట్టి రాఘవేంద్ర, గ్రంధి శ్రీమాన్, నూడిల్స్ హరి, ఆర్యవైశ్య సంఘం వాసవి క్లబ్ వారు పాల్గొన్నారు.

మినీ లారీ సంఘం వారికి అండగా ఉంటా

మినీలారీ యాజమాన్య సంఘంవారికి అండగా ఉంటానని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ చెప్పారు. మినీ లారీ యాజమాన్యల సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ మినీ లారీ స్టాండ్ అసోసియేషన్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. లారీ అసోసియేషన్ సభ్యులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం ప్రెసిడెంట్ ఇబ్రహీం, సెక్రటరీ రవికుమార్, అజీమ్, శైలేష్ బాబు, కే శ్రీనివాస్ తెలుగుదేశం, జనసేన నాయకులు, కార్యకర్తలు సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలు కూల్చి వేయాలని అప్పట్లోనే ఆదేశాలు

● టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు ధారూనాయక్

గుంటూరు, జూన్ 23 : జగన్ సీఎంగా ఉన్నప్పుడే అడ్డగోలు ఆక్రమణలపై అధికారులు నోటీసులు ఇవ్వడమే గాక అక్రమ కట్టడాలు కూల్చివేయాలని అప్పట్లోనే ఆదేశాలు కూడా ఇచ్చారని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం ధారూనాయక్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ మాజీ సీఎం జగన్ నోరు విప్పితే పచ్చి అబద్ధాలు చెబుతారని మరోసారి తేలిందన్నారు. తాడేపల్లి బోటుయార్డులోని రూ.కోట్ల విలువైన భూమిలో జల వనరుల శాఖ అనుమతి లేకుండా, సీఆర్‌డీఏ, తాడేపల్లి-మంగళగిరి కార్పొరేషన్ల నుంచి పర్మిషన్ తీసుకోకుండా అక్రమంగా వైసీపీ కార్యాలయ నిర్మాణం ప్రారంభించారన్నారు. అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాన్ని అధికారులు కూల్చివేయడంపై ఆయన గగ్గోలు పెడుతున్నారని, అధికారులు ఎలాంటి నోటీసులూ ఇవ్వకుండా కూల్చారని ఆరోపిస్తున్నారన్నారు. అయితే అధికారులు నెల రోజులుగా నోటీసులపై నోటీసులు ఇచ్చారన్నారు. వైసీపీ నుంచి ఎలాంటి స్పందనా లేనందునే కూల్చివేతకు వారు ఉపక్రమించారన్నారు.

అన్న మృతి.. మనస్థాపంతో తమ్ముడు ఆత్మహత్య

గుంటూరు, జూన్ 23: స్థానిక లాలాపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని డీఎస్ నగర్ 13వ లైనులో రాయపూడి ఎల్లయ్య (35) అనే వ్యక్తి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. లాలాపేట సీఐ దేవ ప్రభాకర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఎల్లయ్యకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఐదేళ్ళ క్రితం భార్య మృతి చెందడంతో పిల్లలను అమ్మ అనాథ ఆశ్రమంలో చేర్చాడు. ఎల్లయ్య స్వర్ణాంధ్ర నగర్‌లో బంధువుల ఇంట్లో ఉంటున్నాడు. కూలి పనులకు వెళ్తుంటాడు. ఆయన అన్న మూర్తి పెయింటర్‌గా పని చేస్తూ డీఎస్ నగర్‌లో ఉండేవాడు. ఆయనకు భార్య, పిల్లలు ఉండగా ఐదేళ్ళ క్రితం భార్య పిల్లల మధ్య మనస్పర్థలు వచ్చి విడిపోయారు. ఇదిలా ఉంటే ఇటీ వలే ఆయన అన్న మూర్తి అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి ఎల్లయ్య మనస్థాపం చెందాడు. ఈ క్రమంలో తనకు అన్న గుర్తుకు వస్తున్నాడని, ఒక రాత్రి డీఎస్‌నగర్ 13వ లైనులో తన అన్న ఉన్న గదిలో నిద్ర చేసి వస్తానని ఈ నెల 20న వెళ్లాడు. ఆ రోజు మూర్తి ఉన్న గది వద్దకు ఎల్లయ్య రావడం స్థానికులు గమనించారు. ఆ తరువాత నుంచి ఎల్లయ్య కనిపించలేదు. కాగా ఆదివారం మూర్తి గది నుంచి దుర్వాసన రావడం గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు గది తలుపులు తెరచి చూడ గా ఎల్లయ్య గదిలో ఉరి వేసుకుని ఉన్నాడు. మృతదేహం పూర్తిగా కుళ్ళిపోయి ఉంది. ఘటనా స్థలాన్ని పరిశీలించిన లాలాపేట సీఐ దేవప్రభాకర్ రుద్ర ట్రస్ట్ ద్వారా మృతదేహాన్ని మార్చురీకి తరలించా రు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వందే భారత్ రైలు ఢీకొని వృద్ధుడి మృతి

నందివెలుగు రైల్వే గేట్ నుంచి తెనాలి వెళ్లే రైలు మార్గంలో ఆది వారం ఉదయం ఒక గుర్తుతెలియని సుమారు 65 సంవత్సరాల వయస్సు కలిగిన వృద్ధుడు వందే భారత్ రైలు ఢీ కొని మృతి చెందాడు. మృతుడు పొడవాటి గడ్డం కలిగి, ముదురు బూడిద రంగు షాట్, నీలిరంగు, తెలుపురంగు అడ్డచారలు ఉన్న ముదురు బూడిద రంగు కలిగిన టీ షర్ట్ ధరించివున్నాడు. ఆచూకీ తెలిసినట్లయితే 9440627546 గాని 7207076614లకు తెలియజేయాలని జీఆర్పీ సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

లాలాపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొబ్బరికాయల సాంబయ్య కాలనీలోని ఖాళీ ప్రదేశంలో ఆదివారం పేకాట ఆడుతున్న ఐదుగురిని ఎస్ఐ సుబ్బారావు, సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.3020 నగదును స్వాధీనం చేసుకున్నారు.

త్వరలో పొలిటికల్ స్కూల్ ఓపెన్ చేస్తున్నా

● కేకే సర్వే సెస్ సీఈవో కిరణ్ కొండేటి


కిరణ్ కొండేటిని సత్కరిస్తున్న ఐవీ సుబ్బారావు తదితరులు

తాడేపల్లి, జూన్ 23: ఇటీవల జరిగిన ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి బొటాబొటి మెజారిటీతో గెలుస్తుందని మెజార్టీ సర్వేలు తెలుపగా.. కేకే సర్వే అధినేత కిరణ్ కొండేటి మాత్రం కూటమికి 160కి పైగా వస్తాయని చెప్పి సంచలనం సృష్టించాడు. కేకే సర్వే సీఈవో కిరణ్ కొండేటిని దీక్ష మీడియా ఆధ్వర్యంలో శనివారం రాత్రి కుంచనపల్లిలోని ఓ హోటల్‌లో సత్కరించారు. జనసేన, ఏపీయూడబ్ల్యూజే పలు సంఘాల వారు సత్కరించారు. ఈ ఇంటరాక్టివ్ కార్యక్రమం సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ కెకె సర్వేను దేశవ్యాప్తంగా విస్తరిస్తున్నామని వివిధ రాష్ట్రాలలో ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో సర్వేలు చేయమని పలువురు సంప్రదిస్తున్నారన్నారు. అమెరికాలో సర్వే చేయమని సంస్థలు కోరుతున్నాయన్నారు. అలాగే ఔత్సాహికులకు రాజకీయాల్లో ప్రవేశించాలనుకునే యువతకోసం పొలిటికల్ స్కూల్ ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించారు. పలువురు మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో కూడా వైసీపీకి 150 సీట్లు వస్తాయని చెప్పిన ఏకైక సర్వే కేకే సర్వే అని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో అధ్యక్షులు జొన్నా రాజేష్, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి చందు జనార్ధన్, జనసేన గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, మంగళగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాస్, కేశన శంకరరావు, జనసేన నేతలు సామల నాగేశ్వరరావు, అంబటి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

దిక్సూచి DIKSUCHI

జేఎన్‌యూలో ఎమ్మెస్సీ

న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ(జేఎన్‌యూ)- ఎమ్మెస్సీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. బయోటెక్నాలజీ, కంప్యూటేషనల్ అండ్ ఇంటిగ్రేటివ్ సైన్సెస్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్-బయోటెక్నాలజీ(గ్యాట్-బీ) 2024 స్కోర్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

సీట్లు: బయోటెక్నాలజీ స్పెషలైజేషన్‌లో 30 సీట్లు ఉన్నాయి. జనరల్ అభ్యర్థులకు 12, ఎస్సీలకు 5, ఎస్టీలకు 2, ఓబీసీలకు 8, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 3 సీట్లు కేటాయించారు.

● కంప్యూటేషనల్ అండ్ ఇంటిగ్రేటివ్ సైన్సెస్ స్పెషలైజేషన్‌లో 15 సీట్లు ఉన్నాయి. వీటిలో జనరల్ అభ్యర్థులకు 6, ఎస్సీలకు 2, ఎస్టీలకు 1, ఓబీసీలకు 4, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 2 సీట్లు నిర్దేశించారు.

అర్హత: ఎమ్మెస్సీ(బయోటెక్నాలజీ)లో ప్రవేశానికి ఫిజికల్, బయలాజికల్(బయోకెమిస్ట్రీ/బయోఇన్ఫర్మాటిక్స్/బయోటెక్నాలజీ/బోటనీ/మైక్రోబయాలజీ/జువాలజీ), అగ్రికల్చరల్, వెటర్నరీ అండ్ ఫిషరీ సైన్సెస్, ఫార్మసీ సబ్జెక్టులతో డిగ్రీ ఉత్తీర్ణులు; ఇంజనీరింగ్/టెక్నాలజీ డిగ్రీ పూర్తిచేసినవారు; నాలుగేళ్ల బీఎస్సీ(ఫిజీషియన్ అసిస్టెంట్ కోర్సు) పూర్తిచేసినవారు; ఎంబీబీఎస్/బీడీఎస్ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

● ఎమ్మెస్సీ(కంప్యూటేషనల్ అండ్ ఇంటిగ్రేటివ్ సైన్సెస్)లో ప్రవేశానికి బేసిక్ సైన్సెస్, అప్లయిడ్ సైన్సెస్ సబ్జెక్టులతో డిగ్రీ ఉత్తీర్ణులు; బీఈ/బీటెక్/ఎంబీబీఎస్ పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు.

■ **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 27. ■ **వెబ్‌సైట్:** www.jnu.ac.in

ఎఫ్‌సీఆర్‌ఐలో బీఎస్సీ ఆనర్స్ ఫారెస్ట్రీ

సిద్దిపేట జిల్లా ములుగులోని ఫారెస్ట్ కాలేజ్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎఫ్‌సీఆర్‌ఐ) హైదరాబాద్- బీఎస్సీ(ఆనర్స్) ఫారెస్ట్రీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ స్టేట్ హార్టికల్చరల్ యూనివర్సిటీకి ఇది అనుబంధ సంస్థ. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. మొత్తం 55 రెగ్యులర్ సీట్లు ఉన్నాయి. టీఎస్ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. మేథమెటిక్స్ స్ట్రీమ్ అభ్యర్థులకు 25 శాతం, బయాలజీ స్ట్రీమ్ అభ్యర్థులకు 75 శాతం సీట్లు ప్రత్యేకించారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన బోర్డు నుంచి బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ లేదా మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ లేదా మేథమెటిక్స్, బయాలజీ, ఫిజిక్స్ కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. జనరల్ అభ్యర్థులకు 45 శాతం; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు ఉండాలి. టీఎస్ ఈఏపీసెట్ 2024 అర్హత పొంది ఉండాలి. అభ్యర్థుల వయసు డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు మూడేళ్లు; దివ్యాంగులకు అయిదేళ్ల సడలింపు వర్తిస్తుంది.



- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.600; దివ్యాంగులు, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.400
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 27
- **కరెక్షన్ విండో ఓపెన్:** జూన్ 30
- **ఫస్ట్ ఫేజ్ కౌన్సెలింగ్:** జూలై 8
- **సెల్ఫ్ రిపోర్టింగ్‌కు చివరి తేదీ:** జూలై 16
- **సెకండ్ ఫేజ్ సీట్ల అలాట్‌మెంట్:** జూలై 20
- **థర్డ్ ఫేజ్ సీట్ల అలాట్‌మెంట్:** ఆగస్టు 5
- **ఓరియంటేషన్, రిజిస్ట్రేషన్:** ఆగస్టు 12
- **వెబ్‌సైట్:** www.fcrihyd.in/

50వ జీ-7 సమావేశం



ముఖ్యాంశాలు తీర్మానాలు

50వ జీ-7 సమావేశాన్ని సభ్య దేశమైన ఇటలీ జూన్ 13 నుంచి 15 వరకూ అపూలియా రీజియన్‌లో గల బోర్గో ఎగ్నాజియా రిసార్ట్‌లో నిర్వహించింది. 2003 నుంచి అనుసరిస్తున్న ఆనవాయితీ ప్రకారం ఈసారి కూడా సభ్యదేశాలతోపాటు సభ్యేతర దేశాలను కూడా జీ-7 సమావేశ ఔట్‌రీచ్ సెషన్స్‌కు ఆహ్వానించారు. ఆహ్వానం అందుకున్న సభ్యేతర దేశాల్లో భారత్‌తోపాటు అల్జీరియా, అర్జెంటీనా, బ్రెజిల్, జోర్డాన్, కెన్యా, మౌరిటేనియా, టునీషియా, టర్కీ, యునైటెడ్ అరబ్ ఎమిరైట్స్ ఉన్నాయి. ఈ దేశాలతోపాటు ఆఫ్రికన్ డెవలప్‌మెంట్ బ్యాంక్, అంతర్జాతీయ ద్రవ్యనిధి, ప్రపంచబ్యాంకు, ఆర్గనైజేషన్ ఆఫ్ ఎకనామిక్ కోఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్, ఐక్యరాజ్యసమితి అధిపతులు కూడా ఉన్నారు.

సమావేశ థీమ్, ఎజెండా

ఈ ఏడాది జీ-7 సమావేశపు థీమ్‌ను 'రూల్ బేస్డ్ ఇంటర్నేషనల్ సిస్టమ్'గా, సమావేశానికి ప్రత్యేక ఆహ్వానిత దేశాధ్యక్షుడైన టర్కీ అధ్యక్షుడు 'రిసెప్ తయ్యిప్ ఎర్డోగన్' నిర్ణయించారు. ఆతిథ్యదేశంగా ఇటలీ ఈ సమావేశ ఎజెండాను రూపొందించింది. ఎజెండాలో 'ఉక్రెయిన్, గాజాల్లో నెలకొన్న యుద్ధ పరిస్థితులు', 'ఆఫ్రికా, మధ్యధరా ప్రాంత పరిస్థితులు', 'వలసలు', 'ఆర్థిక భద్రత', 'కృత్రిమమేథ' విషయంలో అంతర్జాతీయ సహకారంవంటి అంశాలు ప్రధానంగా ఉన్నాయి.

సమ్మిట్ ముఖ్య నిర్ణయాలు

- జీ-7 సభ్య దేశాలు దాడులను ఎదుర్కొంటున్న ఉక్రెయిన్‌కు మద్దతుగా నిలిచాయి. ఈ సమావేశం నేపథ్యంలో ఉక్రెయిన్‌తో అమెరికా పదేళ్ల సమయానికి గానూ ఒక భద్రతా ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం రష్యాతో పోరాడుతున్న ఉక్రెయిన్‌కు అమెరికా ఆయుధ సంపత్తిని అందించనుంది. ఇదేతరహా భద్రతా ఒప్పందం జపాన్ కూడా ఉక్రెయిన్‌తో కుదుర్చుకోవడం ఈ సదస్సు నేపథ్యంగానే జరిగింది.
- అమెరికా, యూరప్‌ల్లో స్తంభింపజేసిన రష్యా ఆస్తులను హామీగా పెట్టుకుని ఉక్రెయిన్‌కు 50 బిలియన్ డాలర్ల రుణాన్ని జీ-7 దేశాలు అందించాయి. ఇకముందు కూడా దఫాలవారీగా ఇలాంటి రుణాలను ఉక్రెయిన్‌కు అందించేందుకు జీ-7 సభ్యదేశాలు నిర్ణయించాయి. ఉక్రెయిన్‌పై యుద్ధం చేస్తున్నందుకు గానూ రష్యా నష్టపరిహారం చెల్లించేంత వరకు ఇది కొనసాగించాలని నిర్ణయించాయి.
- ఆహార భద్రతకు, పోషకాహారానికి గల వ్యవస్థాగత అడ్డంకులను అధిగమించేందుకు కృషిచేయడానికి 'అపూలియా ఫుడ్ సిస్టమ్స్ ఇనీషియేటివ్'ను ప్రకటించారు.
- అభివృద్ధి చెందుతున్న దేశాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రాజెక్టులకు ఆర్థికంగా సహకరించేందుకు జీ-7 దేశాలు ఆరంభించిన 'పార్టనర్‌షిప్ ఫర్ గ్లోబల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్' ద్వారా 2027 నాటికి 600 బిలియన్ డాలర్ల నిధులు సమీకరించడానికి నిర్ణయించారు.
- కృత్రిమమేథ రంగంలో పరిశోధనలు చేస్తూ అడ్వాన్స్‌డ్ ఏఐ సిస్టమ్స్‌ను రూపొందిస్తున్న సంస్థలను కట్టడి చేసేందుకు అంతర్జాతీయ కోడ్ ఆఫ్ కండక్ట్(ప్రవర్తనా నియమావళిని) రూపొందించడానికి అంగీకరించారు. కృత్రిమమేథ సృష్టించే సమస్యలను ఎదుర్కొంటూ, అది అందించే ప్రయోజనాలను అందిపుచ్చుకునేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.
- అంతర్జాతీయ మార్కెట్‌లో చైనా అవలంబిస్తున్న దమన నీతిని అడ్డుకుని మార్కెట్ ఒడుదొడుకులు, వక్రీకరణల నుంచి పరిశ్రమలను, కార్మికులను, పెట్టుబడులను, ఆర్థికభద్రతను పరిరక్షించుకునేందును జీ-7 దేశాలు చర్యలు తీసుకునేందుకు నిర్ణయించారు.
- వలసలు సంధించే సమస్యలు, అందించే అవకాశాలపరంగా వలస విధానాలపై ఒక సంయుక్త విధాన రూపకల్పనకు 'లాస్‌ఏంజెల్స్ డిక్లరేషన్ ఆన్ మైగ్రేషన్ అండ్ ప్రొటెక్షన్' మార్గనిర్దేశంలో కృషిచేయాలని పిలుపునిచ్చారు.
- అభివృద్ధి చెందుతున్న దేశాలు సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో పురోభివృద్ధి సాధించేందుకు అభివృద్ధి చెందిన దేశాల భాగస్వామ్యం, సహకారం పెంపునకు పిలుపునిచ్చాయి. అదేవిధంగా పరిశుద్ధ ఇంధన వనరుల వినియోగం దిశగా తరలడం ద్వారా వాతావరణ మార్పులను, కాలుష్యాన్ని, జీవవైవిధ్య నష్టాన్ని ఎదుర్కొనేందుకు పిలుపునిచ్చాయి.
- లైంగిక ఆరోగ్యం, పునరుత్పాదక అంశాలు, లింగ అసమానతలకు సంబంధించి సమాన హక్కులు ఉండేలా చర్యల కోసమై పిలుపునిచ్చాయి.
- అంతర్జాతీయ శాంతి భద్రతలను పెంపొందించేందుకు గాజాలో కాల్పుల విరమణను ఆశించడంతోపాటు 'తగిన సమయంలో' పాలస్తీనాను దేశంగా గుర్తించడంతో సహా రెండు దేశాల పరిష్కారానికి జీ-7 కట్టుబడిందని మరోసారి నొక్కిచెప్పారు.

జీ-7 లేదా గ్రూప్ ఆఫ్ సెవెన్.. అనేది ప్రపంచంలోనే అత్యంత సంపన్న దేశాల కూటమి. తొలుత ఆర్థిక, రాజకీయపరమైన అంశాల్లో పరస్పర సహకారానికి ప్రపంచ ధనిక దేశాలీ కూటమిని ఏర్పాటు చేసుకున్నా, కాలక్రమంలో ఈ కూటమి తన లక్ష్యాల పరిధిని పెంచుకుంటూ వస్తోంది. సభ్యదేశాలతోపాటు అవసరార్థం సభ్యేతర దేశాలతో కూడా జట్టుకడుతూ తమ వార్షిక సమావేశాలకు ఆహ్వానించి పరస్పర ప్రయోజన చర్చలకు వేదికవుతోంది. ఈ కోవలో 2003లో మొదలు ఇప్పటివరకూ భారత్ పదకొండుసార్లు ఈ సమావేశాల్లో ఆహ్వానిత దేశంగా పాల్గొంది. 2019 నుంచి వరుసగా ఆహ్వానాన్ని అందుకుంటూనే ఉంది. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థికవ్యవస్థగా ఉభయతారక ప్రయోజనాల కోసం భారత్ ఈ సమావేశాలకు హాజరవుతూ అభివృద్ధి చెందిన దేశాలైన జీ-7 దేశాల సమావేశ వేదికపై తన వాణిని వినిపిస్తూ ఉంది. తాజాగా జీ-7, 50వ సమావేశం ఇటలీలోని అపూలియా రీజన్‌లో జూన్ 13 నుంచి 15 వరకూ జరిగిన నేపథ్యంలో ఆతిథ్య దేశంగా భారత్ 11వ సారి పాల్గొన్న సందర్భంగా జీ-7 పుట్టుపూర్వోత్తరాలు, ఆతిథ్య దేశంగా భారత్ పాత్ర, ప్రస్తుత సమావేశ ప్రధాన లక్ష్యాలు, చేసిన తీర్మానాలపరంగా ఒక విహంగవీక్షణం చేయాల్సిన అవసరం ఉంది.

జీ-7 ఆవిర్భావం-గమనం



1973 ప్రాంతంలో చమురు ఉత్పత్తి దేశాలు చమురు ఉత్పత్తిని ఉద్దేశపూర్వకంగా తగ్గించి, చమురు ధరలు పెరిగేలా చమురు సంక్షోభం(ఫస్ట్ ఆయిల్ క్రైసిస్) సృష్టించాయి. ఆ పరిస్థితులను ఎదుర్కొనేందుకు పారిశ్రామికంగా, ఆర్థికంగా అభివృద్ధి

ఆహ్వానిత దేశంగా భారత్

చెందిన దేశాలైన ఆరు దేశాలు(అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, ఇటలీ, వెస్ట్ జర్మనీ, జపాన్) ఒక కూటమిగా(జీ-6)గా 1975లో ఏర్పడ్డాయి. అనంతరం 1976లో కెనడా కూడా ఈ కూటమిలో చేరడంతో జీ-7గా రూపాంతరీకరణ జరిగింది. 1998లో రష్యా కూడా ఈ కూటమిలో చేరడంతో ఇది జీ-8గా రూపొందింది. కానీ, 2014లో రష్యా, క్రిమియాను ఆక్రమించడంతో రష్యా జీ-8 సభ్యత్వాన్ని రద్దుచేశారు. దాంతో జీ-8గా తాత్కాలికంగా మారిన ఈ కూటమి తిరిగి జీ-7గా స్థిరపడింది.

జీ-7 విధివిధానాలు, భాగస్వాములు, సమావేశాలు

ఈ జీ-7 కూటమి కేవలం ఒక స్వేచ్ఛాయుత, పరస్పర అంగీకార కూటమి. ఏ ఒప్పందం ద్వారానూ/చార్టర్ ద్వారానూ ఇది ఏర్పడలేదు. అదేవిధంగా సభ్యదేశాలను నియంత్రించే ఎలాంటి చట్టపర కట్టుబాట్లు, వ్యవస్థలు దీనికి లేవు. ఒక ప్రధాన కార్యాలయమంటూ ఏదీలేదు.

అయితే ప్రతి సంవత్సరం జీ-7 సమావేశాలు నిరవధికంగా జరుగుతాయి. దఫాలవారీగా ఒక్కొక్క సభ్యదేశం ఈ సమావేశాన్ని నిర్వహించే బాధ్యత ఒక్కో ఏడాది తీసుకుంటుంది. ఆ ఏడాది సమావేశ ఎజెండా కూడా ఆ ఆతిథ్య దేశమే నిర్ణయిస్తుంది. అదేవిధంగా సంవత్సరం పొడవునా వివిధ రాజకీయ, ఆర్థికపరమైన అవసరాలకు అనుగుణంగా మంత్రులు, అధికారుల స్థాయి సమావేశాలు కూడా జరుగుతూ ఉమ్మడి తీర్మానాలు ప్రకటిస్తుంటాయి.

ఈ జీ-7 సమావేశాల్లో ఏడు సభ్యదేశాలతోపాటు యురోపియన్ యూనియన్, వరల్డ్‌బ్యాంక్(ప్రపంచబ్యాంక్), అంతర్జాతీయ ద్రవ్యనిధి(ఐఎంఎఫ్), ఐక్యరాజ్య సమితి కూడా పాల్గొంటాయి.

2003 నుంచి జీ-7 సమావేశాలకు సభ్యేతర దేశాలు కూడా ఆహ్వానిస్తున్నారు. ముఖ్యంగా ఆసియా, ఆఫ్రికా ప్రాంతాల నుంచి ఈ దేశాలను ఆహ్వానించి వివిధ సామాజిక, పర్యావరణ, వ్యాపార అంశాలపరంగా అంతర్జాతీయ సహకారాన్ని ప్రోదిచేయడానికి ఔట్‌రీచ్ సెషన్స్ నిర్వహిస్తారు. జీ-7 సమావేశాలకు సంబంధించిన చర్చనీయాంశాల రూపకల్పనలో, సమావేశానంతర సమీక్షల నిర్వహణల్లో 'షెర్పా'లని పిలిచే పలు దేశాల అధికార గణం(రాయబారులు మొదలైనవారు) కీలకపాత్ర వహిస్తుంది.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

(మిగతా రేపటి దిక్సూచిలో)

'పుష్పక్' హ్యాట్రిక్


(మొదటి పేజీ తరువాయి)

మూడో పరీక్ష ఎల్ఈఎక్స్-03ను కర్ణాటకలోని చిత్రదుర్గ జిల్లా చెళ్లకెరెలోని ఏరోనాటికల్ టెస్ట్ రేంజ్ నుంచి ఆదివారం ఉదయం 7.10 గంటలకు నిర్వహించినట్టు ఇస్రో ఎక్స్ (ట్విటర్)లో వెల్లడించింది. గతంలో నిర్వహించిన ఎల్ఈఎక్స్-01, ఎల్ఈఎక్స్-02 విజయవంతమైన నేపథ్యంలో ఈసారి మూడో ప్రయోగాన్ని మరిన్ని సవాళ్లు, తీవ్రమైన వాతావరణ పరిస్థితుల్లో నిర్వహించినట్టు పేర్కొంది. ప్రయోగంలో భాగంగా పుష్పక్‌ను భారత వాయుసేనకు చెందిన చినూక్ హెలికాప్టర్ ద్వారా రన్‌వేకు 4.5 కిలోమీటర్ల దూరంలో 4.5 కిలోమీటర్ల ఎత్తుకు తీసుకెళ్లి వదిలిపెట్టారు. అక్కడి నుంచి పుష్పక్ స్వయంగా క్రాస్ రేంజ్ కరెక్షన్ విన్యాసాలను చేపడుతూ.. రన్‌వేపైకి చేరుకుని నిర్దేశిత సెంటర్‌లైన్ వద్ద ల్యాండ్ అయింది. ఈ వాహనానికి సంబంధించిన తక్కువ లిఫ్ట్-టు-డ్రాగ్ నిష్పత్తి ఏరోడైనమిక్ కాన్ఫిగరేషన్ కారణంగా ల్యాండింగ్ వేగం గంటకు 320 కి.మీ. కంటే ఎక్కువగా ఉందని, కమర్షియల్ విమానాల్లో ఇది గంటకు 260 కి.మీ., సాధారణ యుద్ధ విమానానికి గంటకు 280 కి.మీ. ఉంటుందని ఇస్రో తెలిపింది. పుష్పక్ రన్‌వేపై ల్యాండయిన తర్వాత బ్రేక్ పారాచూట్ సాయంతో దాని వేగాన్ని గంటకు 100 కి.మీ.కు తగ్గించామని, ఆ తర్వాత ల్యాండింగ్ గేర్ బ్రేక్‌లను ఉపయోగించి దాన్ని రన్‌వేపై నిలిపివేశామని పేర్కొంది. అంతరిక్షం నుంచి తిరిగొచ్చే సమయంలో ఆర్ఎల్వీ విధానం ఎలా ఉంటుంది, హైస్పీడ్ ల్యాండింగ్‌ను అది ఎలా నియంత్రించగలుగుతుంది వంటి పరిస్థితులను ఈ మిషన్ విజయవంతంగా ప్రదర్శించిందని ఇస్రో వివరించింది. విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ (వీఎస్ఎస్సీ) నేతృత్వంలో సాగిన ఈ మిషన్‌ను ఇస్రో కేంద్రాలైన స్పేస్ అప్లికేషన్స్ సెంటర్ (ఎస్ఏసీ), ఇస్రో టెలిమెట్రి, ట్రాకింగ్ అండ్ కమాండ్ నెట్‌వర్క్ (ఇస్ట్రాక్), శ్రీహరికోటలోని సతీష్ ధవన్ స్పేస్ సెంటర్‌ల నుంచి శాస్త్రవేత్తలు పర్యవేక్షించారు. ఎంతో సంక్లిష్టమైన ఈ పరీక్షను విజయవంతం చేసిన బృందాన్ని ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్ అభినందించారు.

హోమో సెక్స్ కేసులో సూరజ్ రేవణ్ణ అరెస్టు

బెంగళూరు, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని దేవెగౌడ కుటుంబానికి మరో షాక్ తగిలింది. ఎమ్మెల్సీ సూరజ్ రేవణ్ణ హోమోసెక్స్ కేసులో అరెస్టయ్యారు. అసహజ లైంగిక దౌర్జన్యం వివాదంలో సాక్ష్యాలను పోలీసులకు వివరించేందుకు వెళ్లిన ఎమ్మెల్సీ సూరజ్‌ను హొళెనరసీపుర పోలీసులు శనివారం రాత్రంతా విచారించారు. ఆదివారం ఉదయం 7.30 గంటలకు సూరజ్ రేవణ్ణను అరెస్టు చేస్తున్నట్లు ప్రకటించారు. సూరజ్‌పై ఐపీసీ 377 (అసహజ లైంగిక దౌర్జన్యం), 342, 506, సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. తనపై సూరజ్‌రేవణ్ణ లైంగిక దౌర్జన్యానికి పాల్పడ్డారని జేడీఎస్ పార్టీకి చెందిన కార్యకర్త ఒకరు ఆరోపించారు. ఈ ఆరోపణలను సూరజ్‌రేవణ్ణ ఖండించారు. తననుంచి రూ.5కోట్లు పొందాలని చేతన్ అనే వ్యక్తి తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని మండిపడ్డారు. ఇలావివాదం సాగుతుండగానే.. తనను చేతన్ బ్లాక్‌మెయిల్ చేసినట్లు సాక్ష్యాలున్నాయంటూ శనివారం రాత్రి సూరజ్‌రేవణ్ణ హొళెనరసీపుర గ్రామీణ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. అయితే, చేతన్ అంతకుముందే డీజీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేసిన నేపథ్యంలో పోలీసులు సూరజ్‌ను తెల్లవారుజామున 4 గంటలదాకా విచారణ జరిపారు. తర్వాత అరెస్టు చేశారు. మరోవైపు బాధితుడిని బెంగళూరులోని బౌరింగ్ ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు.

లోకం తీరు



నేటి నుంచి లోక్‌సభ

(మొదటి పేజీ తరువాయి)

స్వీకారం చేస్తారు. ఒక్కో ఎంపీ ప్రమాణానికి ఒక నిమిషం సమయం ఉంటుంది. ప్రధాని మోదీ క్యాబినెట్‌లోని మంత్రుల్లో 58 మంది లోక్‌సభ సభ్యులు, 13 మంది రాజ్యసభ సభ్యులు ఉన్నారు. మంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టు లూధియానా నుంచి బీజేపీ తరఫున పోటీ చేసి ఓడిపోయారు. ఆయన ఏ సభలోనూ సభ్యుడు కాకపోవడం గమనార్హం. లోక్‌సభ సమావేశాలు జూలై 3 వరకు కొనసాగనున్నాయి. కాగా, లోక్‌సభలో తొలి రోజే ఏపీకి చెందిన 25 మంది సభ్యులు ప్రమాణం చేయనుండగా, రెండో రోజు తెలంగాణకు చెందిన ఎంపీలు ప్రమాణ స్వీకారం చేస్తారు. మూడో రోజైన 26న లోక్‌సభ స్పీకర్ ఎన్నిక ఉంటుంది. రాజ్యాంగంలోని 93వ ఆర్టికల్ ప్రకారం లోక్‌సభ స్పీకర్‌ను ఎన్నుకుంటారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి దాకా లోక్‌సభ స్పీకర్ ఎన్నిక ఏకగ్రీవంగానే జరుగుతూ వస్తోంది. సహజంగా అధికార పక్షానికి చెందిన ఎంపీకి స్పీకర్ పదవి, ప్రతిపక్షాలకు చెందిన అభ్యర్థికి డిప్యూటీ స్పీకర్ పదవి ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సారి ప్రతిపక్షాలకు ఇచ్చే ఉపసభాపతి పదవిని తమకు ఇవ్వాలని ఇండియా కూటమి డిమాండ్ చేస్తోంది. 17వ లోక్‌సభలో బీజేపీకి చెందిన ఓంబిర్లా స్పీకర్‌గా ఉన్నారు. ఉపసభాపతి స్థానానికి ఎవరినీ ఎంపిక చేయకపోవడం వల్ల ఆ పదవి ఐదేళ్లు ఖాళీగా ఉంది. ఈ సారి ఉపసభాపతిని ఇండియా కూటమికి ఇస్తుందా? లేదా ఎన్డీయే మిత్రపక్షాల్లో ఎవరికైనా అప్పగిస్తుందా? అన్నది వేచిచూడాల్సిందే. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ నెల 27న ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఆమె ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రధాని మోదీ 2న లోక్‌సభలో, 3న రాజ్యసభలో ప్రసంగిస్తారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, రామ్మోహన్‌తోపాటు సహాయ మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, సంజయ్, శ్రీనివాస వర్మలు తొలిరోజే ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

అవహేళనలకు గురైనవేళమీ ఆదరణే రక్షించింది

» వయనాడ్ ప్రజలకు రాహుల్ భావోద్వేగ లేఖ

వయనాడ్, జూన్ 23: కేరళలోని వయనాడ్ నియోజకవర్గానికి రాజీనామా చేసిన నేపథ్యంలో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఆదివారం అక్కడి ప్రజలకు భావోద్వేగపూరిత లేఖ రాశారు. వయనాడ్, రాయ్‌బరేలీ రెండు చోట్ల నుంచి లోక్‌సభకు ఎన్నికవడంతో ఆయన ఒక స్థానానికి రాజీనామా చేయాల్సి వచ్చింది. వంశపారంపర్య స్థానంగా గుర్తింపు పొందిన ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ స్థానాన్ని అట్టిపెట్టుకొని వయనాడ్‌ను విడిచిపెట్టారు. ఇక్కడ ఆయన సోదరి ప్రియాంక గాంధీ పోటీ చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఆయన వయనాడ్ ప్రజలకు లేఖ రాశారు. 'ప్రతి రోజూ అవహేళనలకు గురైన సమయంలో మీరు చూపించిన అపరమిత ప్రేమే నన్ను కాపాడింది' అని ఆ లేఖలో ప్రధానంగా పేర్కొన్నారు. "వయనాడ్‌ను వదులుకోవాలన్న నిర్ణయాన్ని ప్రకటించేందుకు మీడియా ముందుకు వచ్చినప్పుడు నా కళ్లలోని విచారాన్ని మీరు చూసే ఉంటారు. అయిదేళ్ల క్రితం ఓ పరాయివ్యక్తిగా మీ ముందుకు వచ్చాను. అయినా మీరు నన్ను నమ్మారు. హద్దులు లేని ప్రేమ, అభిమానంతో అక్కున చేర్చుకున్నారు. ప్రతి రోజూ దుర్భాషలకు గురయిన సమయంలో మీరు చూపిన షరతుల్లేని ప్రేమే నన్ను సంరక్షించింది. మీకు ఎలా కృతజ్ఞతలు చెప్పాలో అర్థం కావడం లేదు. మీరు నా కుటుంబంలో సభ్యులు" అని పేర్కొన్నారు.

సగం మందే హాజరు

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించగా.. చండీగఢ్ కేంద్రంలో పరీక్ష రాయాల్సిన ఇద్దరూ హాజరు కాలేదు. ఛత్తీసగఢ్‌లో రెండు కేంద్రాల్లో 602 మంది పరీక్ష రాయడానికి ఏర్పాట్లు చేయగా.. కేవలం 291 మందే వచ్చారు. హరియాణాలో రెండు కేంద్రాల్లో 494 మందికి ఏర్పాట్లు చేయగా.. 287 మంది, మేఘాలయలో 464 మందికిగాను 234 మంది మాత్రమే పరీక్ష రాశారు. గుజరాత్‌లో ఒకే ఒక్క అభ్యర్థి కోసం పరీక్ష పెట్టారు. మరోవైపు.. నీట్ కేసు దర్యాప్తున చేపట్టిన సీబీఐ.. ఆదివారం ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. కేంద్ర విద్యాశాఖ ఫిర్యాదు మేరకు.. నీట్-యూజీ 2024 పరీక్ష నిర్వహణలో కొన్ని రాష్ట్రాల్లో అవకతవకలు చోటుచేసుకున్నట్టు పేర్కొంటూ గుర్తు తెలియని వ్యక్తులపై ఐపీసీ సెక్షన్ 120-బి (నేరపూరిత కుట్ర), సెక్షన్ 420 (చీటింగ్) కింద కేసులు నమోదు చేసింది. ఇక.. నీట్, యూజీసీ నెట్ ప్రశ్న పత్రాలు లీక్ అయిన నేపథ్యంలో.. ఆ రెండింటితోపాటు జేఈఈ మెయిన్, కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ సహా పలు ప్రవేశ, పోటీ పరీక్షలు నిర్వహించే ఎన్‌టీఏ వెబ్‌సైట్ హ్యాక్ అయ్యిందన్న వదంతులు విస్తృతంగా వ్యాపిస్తున్నాయి. దీంతో ఎన్‌టీఏ అప్రమత్తమై.. అలాంటిదేమీ లేదని, ఎన్‌టీఏ, దాని అనుబంధ వెబ్‌సైట్లన్నీ అత్యంత భద్రంగా ఉన్నాయని ప్రకటించింది. మరోవైపు.. పరీక్షల సంస్కరణలపై ఇస్రో మాజీ చీఫ్ రాధాకృష్ణన్ నేతృత్వంలో కేంద్రం నియమించిన ఏడుగురు సభ్యుల ప్యానెల్ సోమవారం సమావేశం కానుంది.



సీబీఐ అధికారుల కారుకు అడ్డుపడిన కసియాడిహ్ గ్రామస్థులు

ఆ నలుగురికే కాదు..

నీట్ పేపర్ లీక్ కేసులో బిహార్ పోలీసులు అరెస్టు చేసిన ముగ్గురు కీలక నిందితులు తెలిపిన వివరాల ప్రకారం.. నలుగురుకి కాదు.. మొత్తం 25 నుంచి 30 మంది విద్యార్థులకు ప్రశ్నపత్రాన్ని అమ్మారు. ఒక్కొక్కరికీ రూ.30 నుంచి రూ.40 లక్షలకు విక్రయించినట్టు.. సికందర్ యాదవేందు, అఖిలేశ్ కుమార్, బిట్టు కుమార్ , సంజీవ్ సింగ్, రాకీ, నితీశ్, అమిత్ ఆనంద్ తదితర నిందితులు తమ నేరాంగీకార వాంగ్మూలంలో పేర్కొన్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. మే 4వ తేదీ రాత్రి బిహార్‌లోని సాల్వర్ గ్యాంగు మునిసిపల్ జూనియర్ ఇంజనీర్ సికందర్ యాదవేందు ద్వారా నలుగురు విద్యార్థులకు నీట్ ప్రశ్నపత్రాన్ని జవాబులతో సహా అందజేసే సమయంలోనే పట్నా పోలీసులకు ఝార్ఖండ్ పోలీసుల నుంచి ఈ వ్యవహారంపై ఉప్పందింది. ఈ వ్యవహారంలో మొత్తం 13 మంది నిందితుల నేరాంగీకార వాంగ్మూలాలను మే 5వ తేదీనే నమోదు చేశారు. వారిని కోర్టులో హాజరుపరిచి జ్యుడీషియల్ కస్టడీకి పంపారు. కాగా.. కేంద్రానికి బిహార్ ఈవోయు పంపిన ఆరు పేజీల నివేదిక ఆధారంగా ఎన్‌టీఏ మరో 17 మంది విద్యార్థులను డిబార్ చేసింది. దీంతో ఈ ఏడాది నీట్ రాసినవారిలో 110 మందిని డిబార్ చేసినట్టయింది.

సీబీఐ బృందంపై దాడి

యూజీసీ-నెట్ కేసు దర్యాప్తులో భాగంగా.. ఫూల్ చంద్ అనే వ్యక్తి సెల్‌ఫోన్‌ను ట్రాక్ చేస్తూ బిహార్‌లోని నవాదా ప్రాంతానికి వెళ్లిన సీబీఐ బృందంపై కసియాడిహ్ గ్రామస్థులు దాడి చేశారు. సీబీఐ బృందంలో నలుగురు అధికారులు, ఒక మహిళా కానిస్టేబుల్ ఉన్నారు. గ్రామస్థులు వారిపై దాడి చేయగా.. సీబీఐ బృందం స్థానిక పోలీసులకు ఫోన్ చేయగా వచ్చి కాపాడారు. అనంతరం స్థానిక పోలీసుల సమక్షంలో దర్యాప్తు కొనసాగించిన సీబీఐ బృందం రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుంది. కాగా.. తమ గ్రామానికి వచ్చింది నకిలీ అధికారుల బృందం అనే సందేహంతోనే గ్రామస్థులు సీబీఐ అధికారులపై దాడి చేసినట్టు స్థానిక పోలీసులు చెప్పారు.

అలాగే.. ఈ కేసులో బిహార్ ఈవోయు యూనిట్ మరో ఐదుగురిని అరెస్ట్ చేసింది. దీంతో ఈ కేసులో ఇప్పటి దాకా బిహార్‌లో అరెస్టయినవారి సంఖ్య 18కి చేరింది. మహారాష్ట్రలోనూ నాందేడ్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్) పోలీసులు ఇద్దరు టీచర్లను అదుపులోకి తీసుకుని విచారించారు.

నీట్ స్కామ్‌కు మోదీ సర్కారుదే బాధ్యత: ఖర్గే

న్యూఢిల్లీ, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): 'నీట్ కుంభకోణాని'కి మోదీ ప్రభుత్వానిదే బాధ్యత అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. బీజేపీ వల్ల కుళ్లిపోయిన విద్యా వ్యవస్థ.. అధికారులను మార్చినంత మాత్రాన బాగుపడదని శనివారం 'ఎక్స్' పోస్టులో వ్యాఖ్యానించారు. ఇప్పుడు నీట్-పీజీని వాయిదా వేశారని, గత పది రోజుల్లో నాలుగు పరీక్షలను వాయిదా వేయడమో, రద్దు చేయడమో చేశారని గుర్తుచేశారు. విద్యా వ్యవస్థలోకి ప్రశ్నపత్రాల లీక్‌లు, అవినీతి, అక్రమాలు, మాఫియా చొరబడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. పేపర్ లీక్ రాకెట్, మాఫియా ముందు ప్రధాని మోదీ నిస్సహాయంగా మారారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. నీట్-పీజీ వాయిదా పడడం మోదీ హయాంలో ధ్వంసమైన విద్యా వ్యవస్థకు మరో ఉదాహరణ అని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం విద్యావ్యవస్థను, పిల్లల భవిష్యత్తును మాఫియా, అవినీతిపరులు, భజనపరులైన అసమర్థుల చేతుల్లో పెట్టిందని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకా గాంధీ ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం ఒక్క పరీక్షను కూడా సక్రమంగా పారదర్శకంగా నిర్వహించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. యువత భవిష్యత్తుకు బీజేపీయే అతిపెద్ద అడ్డంకిగా మారిందన్నారు.

2038 జూలై 6న గ్రహశకలం
భూమిని ఢీకొట్టే ముప్పు

న్యూఢిల్లీ, జూన్ 23: పద్నాలుగేళ్ల తర్వాత 2038వ సంవత్సరం జూలై 12వ తేదీన ఓ గ్రహశకలం భూమిని ఢీకొట్టే ముప్పు ఎక్కువగా(72%) ఉందని అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా వెల్లడించింది. ఈ గ్రహశకలం పరిమాణం, వేగం, దాని వల్ల కలిగే అనర్థాలపై ఇప్పుడే అంచనాకు రాలేమని తెలిపింది. అయితే, దాన్ని దారి మళ్లించే సాంకేతిక అందుబాటులో ఉన్నప్పటికీ, ఈ గ్రహశకలానికి సంబంధించి ఇంకా ఆ దిశగా ప్రయత్నాలు ప్రారంభం కాలేదని వివరించింది. గ్రహశకలం కదలికలను గమనిస్తున్నామని తెలిపింది. జూన్ 20న మేరీలాండ్‌లోని జాన్స్ హాప్కిన్స్ అప్లైడ్ ఫిజిక్స్ ల్యాబ్(ఏపీఎల్)లో నిర్వహించిన పరిశోధనల్లో ఈ గ్రహశకలం కదలికలను గుర్తించారు. తాజాగా ఓ నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించారు. గ్రహశకలాలు భూమి వైపునకు దూసుకువస్తున్నాయన్న అంతరిక్ష పరిశోధన సంస్థల ప్రకటన లు సాధారణమే అయినప్పటికీ ఈసారి నాసా తేదీతో సహా హెచ్చరించడం ప్రాధాన్యం సంతరించుకొంది.

మేనల్లుడే వారసుడు: మాయావతి



లఖ్‌నవూ, జూన్ 23: బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ) అధినేత్రి మాయావతి తన మేనల్లుడు ఆకాశ్ ఆనంద్‌ను మరోసారి తన రాజకీయ వారసుడిగా ప్రకటించారు. ఆయనకు పార్టీ జాతీయ సమన్వయకర్తగా తిరిగి బాధ్యతలు అప్పగిస్తూ ఆదివారం నిర్ణయం తీసుకున్నారు. గతనెలలో ఎన్నికల సమయంలో ఆకాశ్‌కు పరిపక్వత లేదని పేర్కొంటూ ఆయనను వారసుడిగా తొలగించడంతోపాటు పార్టీ బాధ్యతల నుంచి తప్పించారు. "ఆకాశ్ పూర్తి పరిణతి కలిగిన నేత ఎదుగుతారని ఆశిస్తున్నా. భవిష్యత్తులో అతను నా అంచనాలను అందుకోగలరు" అని తాజాగా మాయావతి పేర్కొన్నారు.



మనోహర్‌కు అభినందనలు తెలుపుతున్న మాజీ ఎంపీ గల్లా జయదేవ్

మనోహర్‌కు గల్లా జయదేవ్ అభినందనలు

తెనాలి రూరల్, జూన్ 23: పౌరసరఫరాల శాఖ మంత్రి, జనసేన పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్‌ను మాజీ ఎంపీ గల్లా జయదేవ్ కలిసి అభినందనలు తెలిపారు. ఆదివారం తెనాలి జనసేన పార్టీ కార్యాలయానికి తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి విచ్చేసిన మాజీ ఎంపీ గల్లా జయదేవ్ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను ఆలింగనం చేసుకుని దుశ్శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా కొంతసేపు ఇద్దరూ పలువిషయాలపై ముచ్చటించుకున్నారు. తెనాలి ప్రాంతం మనోహర్ నేతృత్వంలో అభివృద్ధి, సంక్షేమంవైపు దూసుకుపోనుందని జయదేవ్ ఆశాభావం వ్యక్తంచేశారు. ఆయన వెంట కోవెలమూడి నాని, దేగల ప్రభాకర్ పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.



హోమంలో పాల్గొన్న భక్తులు

కొనసాగుతున్న శాంతి హోమాలు

తెనాలి, మారీసుపేట జూన్ 23: స్థానిక గంగానమ్మపేటలోని శ్రీవిద్యాపీఠంలోని శ్రీసాలిగ్రామ మఠం ట్రస్టు ఆధ్వర్యంలో ప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామి) స్వయం పర్యవేక్షణలో శ్రీనవగ్రహ సహిత శ్రీనక్షత్ర సంపూర్ణ శాంతి హోమ పూజలు కొనసాగుతున్నాయి. ఆదివారం 11వ రోజు పూర్వాషాఢ నక్షత్రం వారితో గణపతి పూజ, రుద్రాభిషేకాలు, గణపతి హోమం, నవగ్రహ హోమం, శ్రీమహామృత్యుంజయ హోమంను యల్లాప్రగడ పవన్‌కుమార్‌శర్మ రుత్వికులచే యజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఛైర్మన్ నంబూరి వెంకట కృష్ణమూర్తి, పెనుగొండ వెంకటేశ్వరావు, జాయింట్ సెక్రటరీ ముద్దాభక్తుని రమణయ్య, ఉప్పల విశ్వనాథం, రావూరి సుబ్బారావు, ఏలూరి రాజేశ్వరరావు, గోపు రామకృష్ణ, కోన నాగేశ్వరావు, చుండూరు లోకనాథం, జయలక్ష్మి మాతృమండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

తెనాలి, మారీసుపేట జూన్ 23: స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని శ్రీమహాత్మా గాంధీ శాంతి వృద్ధాశ్రమంలో వృద్ధులకు శ్రీవెంకటేశ్వర యోగ సేవా కేంద్రం సభ్యులు అన్నదానం చేశారు. ఆదివారం ఎస్‌వీ యోగా సభ్యుడు పాలడుగు వెంకటేశ్వరావు వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులతో కలిసి ఆశ్రమంలోని వృద్ధులకు పండ్లను పంపిణీ చేసి ఆహారం అందించారు. కార్యక్రమంలో ఎస్‌వీ యోగా కన్వీనర్ ముద్దాభక్తుని రమణయ్య, కనకమేడల కృష్ణకుమారి, అనూష, ఆశ్రమ నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి, మురళి, భారతి, సత్యనారాయణ, సునీత పలువును యోగ సాధకులు పాల్గొన్నారు.

మంత్రి నాదెండ్లకు సత్కారం

తెనాలి, మారీసుపేట జూన్ 23: రాష్ట్ర పౌరసరఫర శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాదెండ్ల మనోహర్‌ను ఏపీ ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ సభ్యులు కలసి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏపీ ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ సెక్రటరీ ఏఎస్ రాంకుమార్ ఆధ్వర్యంలో సభ్యులు నాదెండ్ల మనోహర్‌ను మర్యాదపూర్వకంగా కలసి అభినందనలు తెలిపారు. ఆయనను దుశ్శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎన్ సుబ్బారావు, జిల్లా అధ్యక్షుడు కె రాజశేఖర్ మరియు దుగ్గిరాల, రేపల్లె ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్లు పాల్గొన్నారు.



నష్టపోయిన పసుపు రైతులను ఆదుకోవటంపై మనోహర్‌తో మాట్లాడుతున్న ములకా శివసాంబిరెడ్డి, రైతులు

రైతులకు పరిహారం అందించేలా చూడండి

● మంత్రి మనోహర్‌కు శివసాంబిరెడ్డి వినతి

తెనాలి రూరల్, జూన్ 23: దుగ్గిరాల శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన పసుపు రైతులకు నష్టపరిహారం అందించి ఆదుకునేలా ప్రత్యేక చొరవచూపాలని పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకాశివసాంబిరెడ్డి కోరారు. ఆదివారం పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయానికి పసుపు పంట నష్టపోయిన పలువురు రైతులతో కలిసి శివసాంబిరెడ్డి వచ్చి మంత్రి మనోహర్‌ను కలిసి రైతులను ఆదుకోవాలని కోరుతూ వినతి పత్రం అందించారు. కోల్డ్ స్టోరేజ్‌లో పసుపు పంట దగ్ధమై దాదాపుగా ఐదు నెలలు దాటిపోయినా రైతులకు అందించాల్సిన నష్టపరిహారం అందలేదన్నారు. ప్రభుత్వం ఈ విషయంలో జోక్యం చేసుకుని నష్టపోయిన రైతులకు న్యాయం జరిగేలా చూడాలని మనోహర్‌కు విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి మనోహర్ మాట్లాడుతూ దీనిపై మంత్రి నారా లోకేశ్‌కు తెలిపి తన వంతు ప్రయత్నం చేసి చూస్తానని హామీ ఇచ్చారు. రవికిషోర్, పసుపు రైతుల సంఘం కన్వీనర్ వేములపల్లి వెంకటరామయ్య, లంకిరెడ్డి నాగేశ్వరరెడ్డి, నాదెళ్ల చంద్రశేఖర్, సుబ్బారావు, ప్రసాదరావు, సురేంద్ర, రామిరెడ్డి, బొల్లిముంత రామారావు, తుంగల వీరరాఘవులు, చందు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఘనంగా శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి

తెనాలి అర్బన్, జూన్ 23: జనసంఘ్ వ్యవస్థాపకులు శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి ఆదివారం బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ బీజేపీ అధ్యక్షుడు అడపా సంపత్‌రాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాటిబండ్ల రామకృష్ణ మాట్లాడుతూ, క్రమశిక్షణకు, పట్టుదలకు మారుపేరైన ముఖర్జీ ధర్మం కోసం దేశం కోసం పదవులు త్యాగం చేశారని చెప్పారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని యువత నడవాలని కోరారు. తమిరిశ అనంతాచార్యులు, కఠారి వాసుదేవనాయుడు, నందకిషోర్, సాయిగుప్తా, విజయ భాస్కర్‌రెడ్డి, కనకదుర్గ, అన్నవరపు వేణు, రవీంద్ర, హనుమంతరావు పాల్గొన్నారు.

ఆశాజనకంగా ధర.. పెరగనున్న పసుపు విస్తీర్ణం



పసుపు విత్తనాన్ని నాటుతున్న రైతులు

కొల్లిపర, జూన్ 23: పసుపు ధర ఆశాజనకంగా ఉండటంతో ఈ ఏడాది ఎక్కువ శాతం మంది రైతులు పసుపు పంటను వేసేందుకు సిద్ధపడుతున్నారు. జిల్లాలో పసుపు విస్తీర్ణంలో గత సంవత్సరం 2వేల హెక్టార్లు ఉండగా ఈ సంవత్సరం పసుపు విస్తీర్ణం 2వేల 500 హెక్టార్లు పెరిగే అవకాశం కనిపిస్తుంది. ఈ సంవత్సరం పసుపునకు ఒక్కసారిగా క్వింటాల్ 6వేల500 నుంచి 13వేల రూపాయల వరకు ధర పలకటంతో పాటు దిగుబడులు కూడా పెరగటంతో రైతులు లాభాలు గడించారు. సగటున 12వేలు ధర ఉండటంతో వచ్చే సంవత్సరం కూడా ఆదేధర తగ్గదనే భావనకు రైతులు వచ్చారు. దుగ్గిరాల, కొల్లూరు, కొల్లిపర మండలాల్లో రైతులు పసుపు పంటను సాగు చేయటంలో ముందంజలో ఉన్నారు. గ్రామాల్లోనే రైతులు అనేకమంది ఇప్పటికీ విత్తనాన్ని వేయడం ప్రారంభించారు. కొల్లిపర మండలంలో గత సంవత్సరం 2వేల 300 ఎకరాల్లో పసుపు పంట ఉండగా ఈ ఏడాది 3వేల ఎకరాల వరకు పసుపు విస్తీర్ణం పెరగనుంది. ఈ ఏడాది ముందుగా వర్షాలు పడటంతో వాతావరణం అనుకూలంగా ఉండటంతో రైతులు ఇబ్బడి ముబ్బడిగా పసుపు విత్తనాన్ని నాటుతున్నారు.

నిలకడగా పసుపు విత్తనం ధర

రైతులు పసుపు పంటను సాగు చేయడానికి ఆసక్తి చూపినప్పటికి విత్తనం ధర మాత్రం నిలకడగా ఉంది. రెండు వారాల క్రితం పుట్టి పసుపు విత్తనం ధర క్వింటాల్ (225కిలోలు) 9వేల నుంచి 10వేల 500 రూపాయల వరకు ఉంది. అటువంటిది ప్రస్తుతం 12వేల 500రూపాయలు వరకు పలుకుతోంది.

మైదుకూరు, టేకూరుపేట రకాలపై ఆసక్తి

మైదుకూరు, టేకూరుపేట, నిజామాబాద్ రకాలు తేమకు తట్టుకుని మంచి దిగుబడి ఇవ్వడంతో రైతులు ఆ విత్తనాలను వేయటానికి ఆసక్తి చూపుతున్నారని వ్యవసాయాధికారి వెంకట్రావు తెలిపారు. మైదుకూరు, టేకూరుపేట, నిజామాబాద్ రకాలు రైతులు సాగు చేయటం వలన తెగుళ్లను కూడా తట్టుకునే అవకాశం ఉందన్నారు.



పసుపు విత్తనాన్ని కాటావేస్తున్న కూలీలు

పోటీ ప్రపంచంలో రాణించాలంటే నైపుణ్యాలు అవసరం

● డాక్టర్ సాయిరామ్



విద్యార్థులకు ఉపకార వేతనాలు, నోట్‌బుక్స్ అందజేస్తున్న సాయిరామ్, శివకుమార్ తదితరులు

తెనాలి అర్బన్, జూన్ 23: విద్యార్థులు నేటి పోటీ ప్రపంచంలో రాణించాలంటే నైపుణ్యాలు ఎంతో అవసరమని హైదరాబాద్‌కు చెందిన క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ సాయిరామ్ పేర్కొన్నారు. వీరబ్రహ్మేంద్ర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు రూ.1.76 లక్షల ఉపకార వేతనాలు, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, క్రమశిక్షణతో చదివి తల్లిదండ్రులు ఆశించిన స్థానం అందుకోవాలని కోరారు. న్యూరో సర్జన్ డాక్టర్ వజ్రాల శివకుమార్ మాట్లాడుతూ, విద్యతో పాటు వినయాన్ని పెంపొందించుకోవాలని శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కాలజ్ఞానం గురించి చెప్పిన పద్యాలతో ఉదాహరణగా వివరించారు. వేద ధర్మాలను కళ్యాణి వివరించారు. విశ్రాంత తెలుగు పండిట్ సామ్రాజ్యలక్ష్మి రూ.60 వేలు, గుత్తికొండ బ్రహ్మాచారి, నందకిషోర్, మనోహర్‌లు రూ.1,16,000లు ఆర్థిక సాయం అందించారు. విశ్రాంత స్థపతి శనగపాటి బ్రహ్మానందం దంపతులను జీవితకాల సాఫల్య పురస్కారంతో సన్మానించారు. వివిధ రంగాల్లో నిష్ణాతులైన వీరగురు బ్రహ్మాచారి, ఆంజనేయాచారి, వాసుదేవర విశ్వనాథ్‌లను సత్కరించారు. ట్రస్ట్ ఛైర్మన్ ఈఎల్‌వీ అప్పారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వీరేంద్ర, లక్ష్మీకాంతరావు, రమణయ్య, వెంకట్, శివశంకర్ పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో ఆర్టీసీ కార్మికుల జీవితాలు చిన్నాభిన్నం



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న తెలుగునాడు ఆర్టీసీ యూనియన్ నాయకుడు, గౌరవాధ్యక్షుడు వీరవల్లి మురళి

● టీడీపీ వంకతో కార్మికులపై వేధింపులు
● కూటమి రాకతో కార్మికుల జీవితాల్లో వెలుగులు
● తెలుగునాడు కార్మిక పరిషత్ గౌరవాధ్యక్షుడు వీరవల్లి మురళి

తెనాలి రూరల్, జూన్ 23: కార్మికులకు అండగా నిలవాల్సిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో కార్మికుల జీవితాలు చిన్నాభిన్నంగా మార్చిందని ఆర్టీసీ కార్మిక పరిషత్ తెలుగునాడు గౌరవాధ్యక్షుడు వీరవల్లి మురళి ఆవేదన వ్యక్తం చేశారు. తెనాలి మండలం అంగలకుదురులో ఆర్టీసీ తెలుగునాడు యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులతో వీరవల్లి మురళి ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికుల యోగక్షేమాలు విచారించి వీరవల్లి మురళి మాట్లాడుతూ వైసీపీ నాయకులు పార్టీల ముసుగుతో వేధింపులు, డ్రైవర్లపై దాడులు చేసేందుకు కూడా వెనుకాడలేదన్నారు. యూనియన్ గౌరవాధ్యక్షుడిగా కార్మికులకు అండగా ఉంటానని చెప్పారు. డిపోలో సైతం ప్రయాణికులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంలో కూడా వైసీపీ ప్రభుత్వం పెద్దగా దృష్టిపెట్టలేదన్నారు. కార్మికులకు అండగా ఉండే సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ల సారధ్యంలో రాబోయే రోజుల్లో కార్మికులు ఎదుర్కొన్న కష్టాలన్నీ తీరనున్నాయన్నానరు. తొలుత వీరవల్లి మురళిని దుశ్శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛం అందింకారు. జిల్లా అధ్యక్షుడు బీవీ నాయక్, జిల్లా సెక్రటరీ మండవ రాజేష్, తెనాలి సెక్రటరీ ఆరుమళ్ళ చందు, గుంటూరు వన్, టూ డిపో కార్యదర్శులు నాగభూషణం, శంకరరావు, నాయకులు ఇరుమియ్య, రామారావు, రాజేష్, శ్రీనివాసరరావు, వరప్రసాదరరావు, రవి, జయబాబు తదితరులు పాల్గొన్నారు.

ట్యాంక్ బండ్ కల.. ఆగిపోయిందిలా...

● రూ.2.40 కోట్లు బ్యూటిఫికేషన్ కోసం కేటాయింపు
● పూర్తయ్యేందుకు మరో రూ.50 లక్షలు అవసరం



కొన్ని విగ్రహాలు పెట్టిన ఫుట్‌పాత్



పని పూర్తికాక వెలవెలబోతున్న మరో ఫుట్‌పాత్

తెనాలి అర్బన్, జూన్ 23: తెనాలి - విజయవాడ మార్గంలో తలపెట్టిన ట్యాంక్ బండ్ పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. ఇందుకు కేటాయించిన నిధులు చాలకపోవడంతో పాటు మారిన ప్రభుత్వ ఆలోచన ఎలా ఉంటుందోననే అంశం తెరపైకి వచ్చింది. నిజాంపట్నం కాల్వ వెంబడి ప్రజలకు ఆహ్లాదం కలిగించేలా ఆ ప్రాంతాన్ని హైదరాబాద్ ట్యాంక్ బండ్ తరహాలో తీర్చిదిద్దాలని గత పాలకులు తలచారు. ఫుట్‌పాత్‌ను అందంగా తీర్చిదిద్ది మొక్కలు, విగ్రహాలను ఏర్పాటు చేసి ఆహ్లాదంగా తీర్చిదిద్దాలని భావించారు. కానీ ప్రభుత్వం మారడంతో ట్యాంకు బండ్ నిర్మాణం కలగానే మిగిలిపోతుందనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. దానికి తగ్గట్లుగానే పనులు నిలిచిపోయాయి. వీఎస్ఆర్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాల వద్ద ఆర్ అండ్ బీ ప్రధాన రహదారిని రూ.40 కోట్లతో నాలుగు లైన్ల రహదారిగా తీర్చిదిద్దారు. విశాలమైన ఈ రహదారి ఫుట్‌పాత్‌పై తెనాలి ప్రాంతానికి చెందిన మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయాలనే తలంపుతో మున్సిపల్ నిధుల నుంచి బ్యూటిఫికేషన్ పేరిట రూ.2.40 కోట్లు కేటాయించారు. భారీ వినాయక విగ్రహం వద్ద నుంచి ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వరకు ఓ 15 విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు గత పాలకులు ఎన్నికల ముందు హడావుడి చేశారు. కొన్ని విగ్రహాలను మాత్రమే పెట్టగలిగారు. మరికొన్ని విగ్రహాలకు ఏర్పాటు చేసిన దిమ్మెలు అలాగే ఉండిపోయాయి. రెండు దఫాలుగా ఫుట్‌పాత్‌ను పాలరాతితో తీర్చిదిద్ది విగ్రహాల ఏర్పాటుతో పాటు రెండు దుకాణాలను నిర్మించ తలపెట్టగా ఒక దుకాణం పూర్తి చేశారు. ఒక భాగం పనులు పూర్తి కాగా మరికొన్ని విగ్రహాలు పెట్టాల్సి ఉంది. రెండోభాగంలో విగ్రహాలు కానీ, ఫుట్‌పాత్‌ను తీర్చిదిద్దే పని కాని మిగిలిపోయింది. ఇందుకు మరో రూ.50 లక్షలు అవసరమని చెబుతున్నారు. ఇలాగే వదిలేస్తే ఇంతవరకు చేసిన ఖర్చు అంతా వృథా అవుతుందని తెనాలి ప్రాంతానికి వన్నె తెచ్చిన వారి విగ్రహాలు కోసమే ఇది తలపెట్టారని ప్రస్తుత పాలకులు ఆ దిశగా ఆలోచించి పూర్తి చేసి పట్టణ ప్రజలకు ఆహ్లాదపరిచేలా తీర్చిదిద్దాలని పలువురు కోరుతున్నారు.

అండర్-16 బాలుర క్రికెట్ జట్టు రాష్ట్ర స్థాయి ఎంపికలు

గుంటూరు(తూర్పు), జూన్ 23: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నుంచి జూలై 24వ తేదీ వరకు నెల రోజుల పాటు అండర్-16 బాలుర విభా గంలో అంతర జిల్లాల క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్టు ది గుంటూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి డి.రమేష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో మొత్తం 13జట్లు పాల్గొంటాని, పోటీలను పేరేచర్ల, మంగళగిరి, నరసరావుపేట మైదానాల్లో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇందులో పేరేచర్ల, ఏసీఏ మైదానంలో గుంటూరు, చిత్తూరు, కడప, తూర్పుగోదావరి, శ్రీకాకుళం, విశాఖపట్నం, కర్నూలు జిల్లా జట్లు పోటీపడతాయి. పోటీల నుంచి ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అండర్-16 బాలుర జట్టును ఎంపిక చేస్తుందన్నారు.

రామస్వామి వర్ధంతి సభను జయప్రదం చేయండి

తెనాలి, మారీసుపేట జూన్ 23: ఈ నెల 30వ తేదీన జరగనున్న వ్యవసాయ కార్మిక సంఘ ప్రథమ అధ్యక్షుడు కాబోతు రామస్వామి 68వ వర్ధంతి సభను జయప్రదం చేయండని ఎన్‌జీవో నాయుకుడు కృష్ణమోహన్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వర్ధంతి సభ కరపత్రాన్ని సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. వర్ధంతి సభ గుంటూరు కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో నిర్వహిస్తున్నామని అభిమానులు కార్యకర్తలు పాల్గొనాలని కోరారు. వర్ధంతి కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకుడు బొల్లిముంత కృష్ణ, ఎన్‌జీవో నాయకుడు కృష్ణకుమార్, ఎస్టీయూ నాయకుడు కె.బెన్‌హర్‌బాబులు ముఖ్యఅతిథిలుగా పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మికసంఘ సభ్యులు పాల్గొన్నారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి

● టీడీపీ రీసెర్చ్ కమిటీ సభ్యుడు గంగాధర్ డిమాండ్
● జగన్, మాజీ మంత్రులపై పోలీసులకు ఫిర్యాదు

మంగళగిరి సిటీ, జూన్ 23: విశాఖ రుషికొండపై నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరిగాయని, అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని టీడీపీ రీసెర్చ్ కమిటీ సభ్యుడు టి.గంగాధర్ డిమాండ్ చేశారు. ఈ మొత్తం వ్యవహారాన్ని నడిపించిన మాజీ సీఎం జగన్, నాటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి, మాజీమంత్రులపై కేసులు నమోదు చేయాలని కోరుతూ ఆదివారం ఆయన మంగళగిరి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గంగాధర్ మీడియాతో మాట్లాడుతూ రుషికొండపై పర్యాటక శాఖకు చెందిన రూ.కోట్ల విలువ చేసే భవనాలను కూల్చివేసి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. రుషికొండపై హోటళ్ల నిర్మాణం పేరుతో 2021, జూలై 6న పిలిచిన టెండర్లలో రెండు సంస్థలు పాల్గొనగా డీఈసీ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నారని చెప్పారు. 9.88 ఎకరాల విస్తీర్ణంలో హోటళ్ల నిర్మాణం జరుగుతున్నట్టు పేర్కొనడంతోపాటు జీవో నెం.5 ద్వారా రూ.421.87 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. హోటల్ నిర్మాణం మొదలుపెట్టే ముందే అన్ని అనుమతులు తీసుకున్నట్టు కోర్టులకు తప్పుడు నివేదిక ఇచ్చారని, పర్యావరణ చట్టాలు, ఉత్తర్వులను ఉల్లంఘించి నిర్మాణాలు చేపట్టారని అన్నారు. రుషికొండపై గతంలో వున్న 58 పడకలతో కూడిన రిసార్ట్‌ను కూడా అక్రమంగా కూల్చివేశారన్నారు. అదే సమయంలో కొత్త నిర్మాణాల పేరిట రూ.420కోట్లకు పైగా ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేశారని, అన్ని అనుమతులు, నిబంధనలను ఉల్లంఘించారని ఆరోపించారు. మాజీ సీఎం జగన్‌తోపాటు మాజీమంత్రులు, అధికారులపై ఐపీసీ సెక్షన్ 409 కింద కేసులు నమోదుచేసి చర్యలు తీసుకోవాలని గంగాధర్ డిమాండ్ చేశారు.



రోటరీ కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

● ఎమ్మెల్యే ధూళిపాళ్ళ

పొన్నూరు టౌన్, జూన్ 23: పేదల ఆరోగ్య సంరక్షణ కోసం స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటుచేస్తున్న ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పొన్నూరు ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. ఆదివారం రోటరీ క్లబ్ ఆఫ్ పొన్నూరు శంకర్ కంటి ఆసుపత్రి జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ ప్రారంభించారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించిన వైద్య శిబిరంలో 500మంది శిబిరానికి హాజరై కంటి వైద్య పరీక్షలు చేయించుకోగా 304మంది శుక్లాల శస్త్రచికిత్సలకు ఎంపికయ్యారు. వైద్య శిబిరంలో రోటరీ అధ్యక్షుడు బండారుపల్లి శ్రీనివాసరావు కార్యదర్శి బి.రామారావు, బాలకృష్ణ, నన్నపనేని రవీంద్రనాధ్, కారుమూరి శ్రీను, రామకృష్ణ, జీఎంఎస్ గుప్తా తదితరులతో పాటు శంకర్ కంటి ఆసుపత్రి వైద్య బృందం పాల్గొన్నారు.



ఇండియా గేట్ ముందు టీడీపీ బ్యానర్‌ను ప్రదర్శిస్తున్న ముస్లింలు, హాజీ అలీ దర్గాకు చద్దర్ బహూకరిస్తున్న ముస్లింలు

టీడీపీ విజయంతో దర్గాలో చద్దర్ల బహూకరణ

పొన్నూరు టౌన్, జూన్ 23: రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వం విజయం సాధించటంతోపాటు పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ విజయం సాధించటంతో పొన్నూరు ముస్లింలు దేశంలోని ప్రముఖ దర్గాలలో చద్దర్లను బహూకరించి మొక్కుబడులను తీర్చుకున్నారు. పొన్నూరు పట్టణానికి చెందిన పలువురు తెలుగుదేశం పార్టీ ముస్లిం నాయకులు ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ విజయం తోపాటు, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ప్రార్థనలు చేశారు. కర్నాటకలోని గుల్బర్గా దర్గా, ఖాజా పందే నవాజ్ దర్గాను సందర్శించుకుని చద్దర్‌ను బహూకరించారు. అలాగే ముంబై హాజీ అలీ దర్గాను దర్శించుకుని చద్దర్‌ను అందించారు. ముంబైయిలోని ఇండియా గేట్ వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎమ్మెల్యే నరేంద్ర కుమార్‌తో ఉన్న టీడీపీ పతాకాన్ని ప్రదర్శించి తమ హర్షం వ్యక్తం చేశారు.



గొడవర్రు నుంచి పాదయాత్రగా బయల్దేరిన టీడీపీ నాయకులు

మొక్కులు తీర్చుకున్న టీడీపీ శ్రేణులు

చేబ్రోలు, జూన్ 23: రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి గెలుపు, చంద్రబాబు నాయుడు, ధూళిపాళ్ళ నరేంద్ర కుమారులు విజయం సాధించటంతో చేబ్రోలు మండలం గొడవర్రు నాయకులు ఆదివారం మొక్కులు తీర్చుకున్నారు. మండల పరిధిలోని గొడవర్రు గ్రామం నుంచి తెలుగుదేశం పార్టీ శ్రేణులు పాదయాత్రగా తెనాలి వైకుంఠపురం బయల్దేరివెళ్లారు. వైకుంఠపురం పాదయాత్రగా చేరుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ గెలుపు సందర్భంగా టీడీపీ శ్రేణులు వెంకటేశ్వరస్వామికి తమ మొక్కులను చెల్లించుకున్నారు. పాదయాత్రలో టీడీపీ నాయకులు తాటి శంకర్, పసుపులేటి అచ్చియ్య, కొండేపు రోశయ్య పల్లా శ్రీనివాసరావు, పసుపులేని శ్రీను, మొవ్వ నాగూర్ తదితరులు పాల్గొన్నారు.



శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి

పొన్నూరు టౌన్, జూన్ 23: డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ ఆదివారం భారతీయ జనతా పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల అధ్యక్షుడు వడ్రాణం ఉదయ్ చంద్రరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చేసిన సేవలను మననం చేసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కలపాల శ్రీనివాసరావు, లీడర్ సెల్ జిల్లా కోకన్వీనర్ గండు శ్రీనివాసరావు, గుడివాడ పవన్, కె శివకుమార్, గురుబాలు, టి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సిబార్ డెంటల్ కళాశాల ఛైర్మన్ రవీంద్రనాథ్ మృతి

పెదకాకాని, జూన్ 23: తక్కెళ్ళపాడు సిబార్ దంత వైద్య కళాశాల ఛైర్మన్ డాక్టర్ అట్లూరి రవీంద్రనాథ్ ఠాగూర్(81) మృతిచెందారు. రెండు రోజులుగా ఆయన అనారోగ్యంతో విజయవాడలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మరణించారు. ఠాగూర్ సిబార్ కాలేజీతో పాటు విజయవాడ ఏలూరు రోడ్‌లోని కొత్తవంతెన సెంటర్లో అశ్విని నర్సింగ్‌హోమ్ స్థాపించారు. ఆయనకు భార్య డాక్టర్ దుర్గారాణి, ఇద్దరు కుమారులు డాక్టర్ వినయ్, డాక్టర్ శ్రీకాంత్‌లు ఉన్నారు.

పెద్దపాలెం వైసీపీ సర్పంచ్ రాజీనామా



ఎంపీడీవోకు రాజీనామ అందచేస్తున్న పెద్దపాలెం సర్పంచ్ శివ పార్వతి

పొన్నూరు టౌన్, జూన్ 23: మండల పరిధిలోని పెద్దపాలెం గ్రామానికి చెందిన వైసీపీ సర్పంచ్ వల్లభాపురపు శివపార్వతి ఆదివారం సర్పంచ్ పదవికి రాజీనామా చేశారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఓడిపోయినందున తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు సర్పంచ్ శివపార్వతి రాజీనామా పత్రంలో పేర్కొన్నారు. తన రాజీనామాను తక్షణమే ఆమోదించాల్సిందిగా ఎంపీడీవో టి రత్నజ్యోతిని సర్పంచ్ శివ పార్వతి కోరారు.